

వనమహోత్సవంలో మొక్కలు నాటి నీరు పోస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పక్కన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా తదితరులు

అమ్మ పేరుతో.. చెట్టు పెంచండి






● ప్రమాణం చేయించిన విద్యార్థినిని సన్మానించిన చంద్రబాబు, పవన్

రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన వన మహోత్సవం ఉమ్మడి జిల్లాలో కోలాహలంగా జరిగింది. ప్రతి గ్రామంలోనూ ప్రజలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరిలోని ఎకో పార్కులో ప్రారంభించారు. మొక్కలు నాటి స్థానిక ప్రజలతో మాట్లాడారు. మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలిలో మొక్కలు నాటారు. అదే విధంగా ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు అసలు వన మహోత్సవ కార్యక్రమం సీఎం నరసరావుపేటలో ప్రారంభించాల్సి ఉంది. స్థానిక అధికారులు దానికి తగిన ఏర్పాట్లు చేశారు. అయితే శుక్రవారం వర్షం కారణంగా, అక్కడ కార్యక్రమాన్ని రద్దు చేసి, మంగళగిరిలో నిర్వహించడం గమనార్హం.

- మంగళగిరి ఎకో పార్కుపై సీఎం ప్రశంసల జల్లు
- మేం అడిగితే ఆ చెట్టును చూపించి.. మీ అమ్మపేరు చెప్పండి
- రాజధాని అమరావతిలో అద్భుతమైన గ్రీన్ సిటీగా రూపొందిస్తాం
- సాగర్- శ్రీశైలం మధ్య దేశంలోనే అతిపెద్ద పులుల శాంక్చురీ
- అట్టహాసంగా మంగళగిరి ఎకో పార్కులో వన మహోత్సవం
- ఒక చెట్టు పదిమంది కొడుకులతో సమానం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- మొక్క ప్రగతికి చిహ్నం: కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని

గుంటూరు, మంగళగిరి ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'మంగళగిరి ఎకో పార్కును చూస్తే ఎంతో ఆనందం కలిగింది. సుందరమైన అడవి.. పక్కనే ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎయిమ్స్ భవనాలు.. మరో పక్కన బెటాలియన్.. ఇవన్నీ చూస్తే ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తోంది. అమరావతి నడిబొడ్డున ఇలాంటి అద్భుతమైన ఎకో పార్కు వుందంటే చాలా సంతోషంగా వుంది. నేను ఇంట్లో నుంచి బయటకు వస్తే మరో ప్రపంచానికి వచ్చినట్లుంది. ఈ వాతావరణం చూస్తే ఇక్కడే ఇల్లు కట్టుకోవాలనిపిస్తోంది. అంత సుందరంగా, కళ్లకు ఆకర్షణీయంగా ఈ పార్కు కనిపిస్తోంది.' అంటూ మంగళగిరి ఎకో పార్కుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసల వర్షం కురిపించారు. ఎకో పార్కులో ప్రస్తుతం రోజుకు 300 మంది వస్తున్నారని, రానున్న రోజుల్లో ఆ సంఖ్య 3000కు పెరగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భారీ వర్షాల కారణంగా నరసరావుపేట జేఎన్‌టీయూలో జరగాల్సిన కార్యక్రమాన్ని అప్పటికప్పుడు మంగళగిరిలోని ఎకో పార్కులో నిర్వహించారు. అప్పటికప్పుడు ఏర్పాటు కార్యక్రమం అయినప్పటికీ కార్యక్రమం ఎంతో అట్టహాసంగా సాగింది. కార్యాక్రమానికి అర్ధగంట ముందే వచ్చిన రాష్ట్ర అటవీశాఖా మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎకో పార్కులో కలియదిరిగారు. తనను కలవడానికి ప్రయత్నించిన అభిమాను లు, ఉభయ పార్టీల కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. వారితో కలిసి తిరిగారు.

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు రావడంతో ఆయనతో కలిసి ఎకో పార్కును పరిశీలించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే, అటవీశాఖ అధికారులు, మంగళగిరి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సంప్రదాయానికి భిన్నంగా సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో విద్యార్థులు వన మహోత్సవ ప్రమాణం చేయించారు. ప్రమాణం చేయించిన మంగళగిరి మున్సిపల్ హైస్కూలు చిన్నారిని ఆయన, పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తు వారిదే కాబట్టి వారి ద్వారా తాము ప్రమాణం చేశా మని ఈ సందర్భంగా చంద్రబాబు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సభలో నవ్వులు పూయించారు. మారిన ముఖ్యమంత్రిగా చమత్కారాలతో అందరినీ అహ్లాదపరుస్తూ విద్యా ర్థులకు కర్తవ్యాలు బోధించారు. ప్రజలకు తమ బాధ్యతలు గుర్తుచేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, వ్యవస్థల విధ్వంసం, వైఫల్యాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలకు, ప్రధానంగా చిన్నారులకు మంచి భవిష్యత్తును హామీ ఇచ్చారు.



తల్లి రుణం తీర్చుకునేందుకు ఇదో అవకాశం

ఈ రోజు నుంచే ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటండి.. ఆ మొక్కకు తల్లిపేరు పెట్టండి. మనకు జన్మనిచ్చిన తల్లి రుణం తీర్చుకునేందుకు ఇది ఒక మంచి అవకాశం. నేను పవన్ కల్యాణ్ మళ్లీ మీ దగ్గరకి వస్తాం. అప్పుడు మీరు నాటిన మొక్కను మాకు చూపించాలి. పేరు అడిగితే మీ అమ్మపేరు చెప్పాలని చంద్రబాబు వన మహోత్సవం సందర్భంగా చిన్నారుల వద్ద హామీ తీసుకున్నారు. గత ముఖ్యమంత్రిలాగా రాళ్ల మీద తన బొమ్మ వేసుకోబోమని ఎద్దేవా చేశారు. ఎవరు నాటిన మొక్కకు వారే తమ తల్లి పేరు పెట్టుకోవచ్చని చమత్కరించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ రెండేసి మొక్కలు నాటితే ఏడాదికి పది కోట్ల మొక్కలు అవుతాయన్నారు. తద్వారా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంకల్పించినట్లు 50 శాతం పచ్చదనాన్ని సాధించవచ్చన్నారు. ఆ కార్యక్రమాన్ని ఈ ఏడాది కోటి మొక్కలతో ప్రారంభిస్తున్నామన్నారు. తద్వారా ఏడాదికి 0.33 శాతం పచ్చదనం పెరుగుతుందని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో 32 కమ్యూనిటీ ఆధారిత ఎకోటూరిజం సెంటర్లు, 175 నియోజకవర్గాల్లో జపనీస్ టెక్నాలజీ, నరేగా డబ్బులు వినియోగించి నగర వనాలను నిర్మిస్తామన్నారు. తద్వారా పవన్ కల్యాణ్ చెప్పినట్లు 50 శాతం పచ్చదనం వస్తుందన్నారు. అదే అసలైన స్వర్ణాంధ్రప్రదేశ్ అన్నారు. పవన్ కల్యాణ్‌కు నిధుల కొరత లేదని, ఆయన చేతిలో నరేగా, అటవీ శాఖలు వున్నాయని, వాటి అనుసంధానంతో అడవుల పెంపకం ఎంతో సులువవుతుందన్నారు. ఇలాంటి మా కొత్త ఆలోచనలను కేంద్ర మంత్రి పెమ్మసాని సాకారం చేసే దిశగా కేంద్రంలో కృషి చేయాలన్నారు. నగర వనాల నిర్మాణాల్లో భాగమయ్యేందుకు ముందుకు వచ్చేవారి సహాయం తీసుకుంటా మన్నారు.



● పులులను చూడాలంటే పవన్ కల్యాణ్‌ను అడగాల్సిందే..

నాగార్జున సాగర్, శ్రీశైలం దగ్గర 5,300 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పులుల శాంక్చురి వస్తుందని చంద్రబాబు చెప్పారు. అక్కడ 80 పులులు వుంటాయని, అద్భుతమైన సఫారీని నిర్మిస్తామని ఆయన తెలిపారు. పులులను చూడాలంటే ఎక్కడికో వెళ్లాల్సిన పనిలేదని నాగార్జున సాగర్ వెళ్లి పవన్ కల్యాణ్‌ను తలుచుకుంటే చాలని చమత్కరించారు. రాష్ట్రంలో 13 వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, మూడు నేషనల్ పార్కులు, రెండు జూలాజికల్ పార్కులు వున్నాయని, ఒక టైగర్ పార్కు, ఒక ఏనుగుల శాంక్చురి వచ్చే అవకాశం వుందని చెప్పారు.



ప్రమాణం చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని, కలెక్టర్ నాగలక్ష్మి



ఒక చెట్టు పది మంది కొడుకులతో సమానం: డిప్యూటీ సీఎం పవన్

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ అటవీ శాఖ మంత్రిగా తనకు ఈ కార్యక్రమం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వరుణ దేవుడు కూడా తన శుభాశీస్సులు అందించారన్నారు. హరితాంధ్రప్రదేశ్ సాధించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం తన బాధ్యత అన్నారు. చెట్లు నరకడం తేలికే.. పెంచడం కష్టమన్నారు. గత ముఖ్యమంత్రి వందల చెట్లు నరికేశాడని, తాము అలా కాదన్నారు. ప్రతి దేవాలయం, మసీదు, చర్చి, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు పెంచు తామన్నారు. ఒక చెట్టు పది మంది కొడుకులతో సమానమని అరణ్యసూక్తం చెప్పిందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ చెట్టును పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. జపాన్‌కు చెందిన మియావకి పద్ధతిలో అనతి కాలంలోనే దట్టమైన అడవులు పెంచవచ్చని, ఆ పుస్తకాలను అందరికీ అందుబాటులోకి తెస్తామన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ విత్తనం నాటిన తరువాత అది ఎన్నో అవాం తరాలను అధిగమించి మొక్కై, మహా వృక్షమై ఎదుగుతుందన్నారు. అది ప్రగతికి చిహ్నమన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అనంతరామ్, కలెక్టర్ నాగలక్ష్మి, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, గుంటూరు జెడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, టీడీపీ నేత తమ్మిశెట్టి జానకీ, స్థానిక ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



ఎడతెరిపిలేని వర్షం.. ఎండుతున్న పైర్లకు జీవం

- అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం
- వేసవిని తలపించిన ఎండల నుంచి ఉపశమనం
- జిల్లాలో సగటున 16.2 మి.మీ వర్షపాతం నమోదు

బాపట్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గడచిన వారంరోజులుగా వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. దిగువన ఉన్న పొలాలకు నీరందక నారుమళ్లు ఎండిపోయే పరిస్థితి. వీటన్నింటికి ఉపశమనం కలిగించేలా గత రెండురోజులుగా జిల్లాలో ఎడతె రిపిలేని వర్షంపడింది. శుక్రవారం ఉదయం వరకు జిల్లావ్యాప్తంగా 40.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, 16.2మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా రేపల్లెలో 40.2మి.మీ., అత్యల్పంగా వేటపాలెంలో 4.6మి.మీ., కర్లపాలెంలో 35.8మి.మీ., పిట్టలవానిపాలెంలో 18.6మి.మీ., బాపట్లలో 22.8మి.మీ., వేమూరులో 26.2మి.మీ., మార్టూరులో 18.4మి.మీ నమోదైంది. గతంలో కురిసిన వర్షాలవల్ల ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నా దిగువన ఉన్న పొలాలకు నీరందక వాన రాక కోసం ఆశగాచూసిన అన్నదాతలకు ఈ వర్షాలు ఊపిరిపోశాయి. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో సకాలంలో వర్షాలు కురవక ఎండిపోయే స్థితిలో ఉన్న తరుణంలో ఎడతెరిపిలేని వానలు మొక్కజొన్న రైతుల్లో ఆనందాన్ని నింపాయి. ముఖ్యంగా శివారు ప్రాంతంలో ఉన్న చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాల పరిధిలో నీరందక నారుమళ్లు ఎండిపోయే పరిస్థితి. దీనికితోడు కాలువల్లో పూడికతీత ఇంకా పూర్తికాకపోవడం కూడా అన్నదాతలకు శాపంగా మారింది. అల్పపీడన ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆయా పైర్లకు జీవంపోశాయి. మరో రెండురోజులపాటు ఒక మోస్తరు వర్షాలు జిల్లావ్యాప్తంగా కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో రైతులు సంతోషం వ్యక్తంచే స్తున్నారు. నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లోని పొలాల్లో నిండుగా వర్షపునీరు నిలిచింది. దీంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే 90శాతం భూములలో వరినాట్లు, వెదసాగు చేపట్టారు. ఇంకా 10శాతం భూముల్లోనూ వర్షంతో నాట్లుపడే అవకాశం ఉంది.

30,000 ఎకరాల సాగుకు ఉపయోగం

గత ఐదేళ్లలో వైసీపీ నిర్వాకంవల్ల ఎగువన ఉన్న జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నా దిగువనున్న పొలాలకు సకాలంలో సాగునీరందక ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఏ కాలువలోనూ పూడికతీత, మరమ్మతుల గురించి గత ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ఎగువన వదిలిన నీరు దిగువకు ప్రవహించకపోవడంతో వర్షాలపైనే రైతులు ఆశ పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కాల్వల్లో పూడికతీత పనులు చేయిస్తున్నా ఆ పనులు పూర్తికావడానికి మరింత సమయంపట్టే అవకాశం ఉంది. లక్షల్లో అప్పులుచేసి సేద్యం మొదలుపెట్టిన రైతులకు.. ఈ వర్షం ఆశలు చిగురించేలా చేసింది. దిగువన ఉన్న దాదాపు 30,000 ఎకరాల సాగుకు ఈ వర్షాలు ఉపయోగపడనున్నాయి.

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి....

జిల్లాలో ఇప్పటికే విషజ్వరాల వ్యాప్తి ఎక్కువగా ఉంది. ఎడతెరిపిలేని వర్షాల ధాటికి ఎక్కడికక్కడ నీళ్లు నిలబడి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దీనికితోడు డ్రైనేజీల్లో వర్షపునీరు నిలబడి రోడ్డుపైకి చేరుతుండటంతో దుర్గంధం వ్యాప్తి చెందుతోంది. పారిశుధ్యం మెరుగుపై అధికారులు దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో విష జ్వరాలు మరింతగా ప్రబలి ప్రజలు ఆసుపత్రుల పాలయ్యే ప్రమాదం పొంచి ఉంది.

చెట్లను కాపాడితే పర్యావరణ పరిరక్షణ

- వనమహోత్సవంలో మొక్క నాటిన కలెక్టర్ జె.వెంకటమురళీ
- జిల్లాలో 20 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధం

బాపట్ల, ఆగస్టు 30: ప్రాణవాయువుని ఇచ్చే చెట్లను కాపాడితే భావితరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని కలెక్టర్ జె.వెంకటమురళీ తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. బాపట్ల మండలం సూర్యలంక రోడ్డులోని ముత్తాయపాలెం వనంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటి నీరుపోశారు. అనంతరం ఔషధమొక్కలను కలెక్టర్ చేతులమీదగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ అటవీసంపద పెరిగితేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. భూభాగంలో కనీసం 33 శాతం అటవీసంపద ఉండాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నప్పటికి అభివృద్ధి పేరుతో చెట్లను నరికివేయటం మంచిది కాదన్నారు. ప్రస్తుతం 20శాతం చెట్లు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరు ఒక మొక్క తప్పనిసరిగా నాటాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో 20 లక్షలమొక్కలు నాటతామని, నవంబరులో కార్తీకవన సమారాధన వరకు మొక్కలు నాటే ప్రక్రియ కొనసాగించాలని చెప్పారు. లక్ష్యం మేరకు రహదార్లు, కాల్వల వెంట ప్రభుత్వకార్యాలయాలు, ప్రభుత్వస్థలాలలో మొక్కలు నాటాలన్నారు. హైదరాబాద్‌లో 2వేల అడుగుల లోతుగా బోరువేసినా నీరందే పరిస్థితి లేదన్నారు. బెంగుళూరులో ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇక్కడ రాకూడదన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారి బీవీ రమణరావు, డిప్యూటీ రేంజ్ అధికారి వై.బాలకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి సి.హెచ్.సువార్త, సాంఘిక సంక్షేమశాఖ ఏడీ జె.రాజాదెబోరా, ఉద్యానవన శాఖాధికారి జెన్నెమ్మ, తహసీల్దార్ శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బాపట్ల మండలం ముత్తాయపాలెంలోని వనంలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి, అధికారులు

జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా శేషగిరిబాబు

బాపట్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షించే నిమిత్తం బాపట్ల జిల్లాకు స్పెషల్ ఆఫీసర్‌గా ఐఏఎస్ అధికారి ఎం.వి. శేషగిరిబాబును నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. 2006 బ్యాచ్‌కు చెందిన శేషగిరిబాబు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసే వివిధ కార్యక్రమాలకు సంబంధించి జిల్లాలో పనితీరుపై ఆయన దృష్టి పెట్టి సూచనలు ఇవ్వనున్నారు.

మిలిటరీ స్కూళ్లలో 6, 9వ తరగతుల్లో ప్రవేశాలు



దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎంట్రెన్స్ టెస్ట్‌లో వచ్చిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

మిలిటరీ స్కూళ్లు ఉన్న ప్రాంతాలు, వాటి వివరాలు: చైల్(హిమాచల్ ప్రదేశ్), అజ్మీర్(రాజస్థాన్), ధోల్‌పూర్(రాజస్థాన్), బెల్గాం(కర్ణాటక), బెంగళూరు(కర్ణాటక). రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు బాలబాలికలకు విద్యా బోధన ఉంటుంది. వీటిలో రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, ఇతర వర్గాల పౌరుల పిల్లలు చదువుకోవచ్చు. ఈ పాఠశాలలను రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. ఇవి ఆంగ్ల మాధ్యమంలో నడిచే రెసిడెన్షియల్ పబ్లిక్ పాఠశాలలు.

- రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్) 2025-26

అర్హతలు: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

▼ 9వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయోపరిమితి: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి 2025 మార్చి 31 నాటికి విద్యార్థి వయస్సు 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 2010 ఏప్రిల్ 1 నుంచి మార్చి 2012 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.

రిజర్వేషన్: రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, అలాగే, ఇతర వర్గాల పౌరుల పిల్లలకు మాత్రమే కేటాయించారు.

ఎంపిక ప్రక్రియ: రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ఇతర రిజర్వేషన్లను అనుసరించి సీటు కేటాయిస్తారు.

ప్రవేశ పరీక్ష: పరీక్షలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.

పరీక్ష సబ్జెక్టులు

6వ తరగతి: ఇంటెలిజెన్స్(50 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్(50 మార్కులు), మేథ్స్(50 మార్కులు), ఇంగ్లీష్(50 మార్కులు). 5వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు.

9వ తరగతి: ఇంగ్లీష్(50 మార్కులు), హిందీ(20 మార్కులు), సోషల్ సైన్స్(30 మార్కులు), మేథ్స్(50 మార్కులు), సైన్స్(50 మార్కులు). 8వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 50 మార్కులు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 19

వెబ్‌సైట్: www.rashtriyamilitaryschools.edu.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/nuz8UXzలో చదవండి.

దిక్సూచి DIKSUCHI



ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఏపీ పీజీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా వర్సిటీ నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు లభించవు.

కోర్సులు-స్పెషలైజేషన్‌లు

- **ఎంఏ:** ఇంగ్లీష్, తెలుగు, హిందీ, కూచిపూడి క్లాసికల్ డ్యాన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, సోషియాలజీ, సోషల్ వర్క్, యోగా, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అప్లయిడ్ ఎకనామిక్స్, ఎకనామిక్స్, మేథమెటిక్స్
- **ఎంఎఫ్ఏ:** స్కల్ప్చర్, పెయింటింగ్, ప్రింట్ మేకింగ్
- మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్ఆర్ఎం)
- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ)
- మాస్టర్ ఆఫ్ కామర్స్(ఎంకాం)
- మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(ఎంపీఈడీ)

ఎమ్మెస్సీ: బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మెరైన్ బయాలజీ అండ్ ఫిషరీస్, కోస్టల్ ఆక్వా కల్చర్ అండ్ మెరైన్ బయోటెక్నాలజీ, మెరైన్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, హ్యూమన్ జెనెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, హోమ్ సైన్స్(ఫుడ్, న్యూట్రిషన్, డైటెటిక్స్), బోటనీ, జువాలజీ, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, మెరైన్ జియోఫిజిక్స్, జియోఫిజిక్స్, ఫిజికల్ ఓషనోగ్రఫీ, మెటరాలజీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, కెమిస్ట్రీ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఫుడ్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, జియాలజీ, అప్లయిడ్ జియాలజీ, సైకాలజీ, జాగ్రఫీ, అప్లయిడ్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 5
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో
బీవీఎస్సీ & ఏహెచ్

ఐకార్ ఆధ్వర్యంలోని ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐవీఆర్ఐ)- బీవీఎస్సీ & ఏహెచ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఇందులోనే ఏడాది పాటు కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. వీటిలో 45 రెగ్యులర్ సీట్లు, 8 పేమెంట్ సీట్లు(సూపర్ న్యూమరరీ) ఉన్నాయి. వీటిని నీట్ యూజీ 2024 ర్యాంక్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఎన్ఆర్ఐ కోటా కింద రెండు సీట్లు(సూపర్ న్యూమరరీ) ప్రత్యేకించారు. వీటిని అభ్యర్థుల అకడమిక్ మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. మిగిలిన అయిదు సీట్లను రోస్టర్ విధానంలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా భర్తీ చేస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టుల్లో మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. నీట్ యూజీ 2024 అర్హత పొందాలి. ఇందులో నిర్దేశించిన కటాఫ్ కంటే ఎక్కువ మార్కులు తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 ఏళ్లు నిండి ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 18
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 26
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 27
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 7
- **కోర్సు ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** ivri.nic.in

నవ్య | చిత్రజ్యోతి

ఇక్కడ కూడా అలాంటి కమిటీ వేయాలి

మాలీవుడ్‌లో కొనసాగుతున్న కీచకుల అకృత్యాలను బయట పెట్టిన జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌ను హీరోయిన్ సమంత స్వాగతించిన విషయం తెలిసిందే. తెలుగు చిత్ర పరిశ్రమలోని లైంగిక వేధింపులపై తెలంగాణ ప్రభుత్వం కూడా దృష్టి సారించాలనీ, జస్టిస్ హేమ కమిటీ తరహాలో ఇక్కడ కూడా ఓ కమిటీ వేయాలని సమంత కోరారు. వేధింపులకు గురి కాకుండా తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం అప్పుడే మహిళా ఆర్టిస్టులకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. 'తెలుగు చిత్రపరిశ్రమలో మహిళలుగా మేమంతా జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌కు స్వాగతం పలుకుతున్నాం. అలాగే కీచకులపై పోరాటం చేస్తున్న డబ్ల్యూసీసీ చర్యలను అభినందిస్తున్నాం. మాలీవుడ్‌లో మహిళల హక్కుల కోసం డబ్ల్యూసీసీ విజయవంతమైన పోరాటం చేసింది' అని సమంత అన్నారు.



బాలకృష్ణ స్వర్ణోత్సవ సభకు అతిరథమహారథులు



నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. సెప్టెంబర్ ఒకటిన నోవాటెల్ హోటల్‌లో ఈ వేడుకలకు అతిరథమహారథులు హాజరవుతున్నారు. ఇప్పటికే ఎంతో మందికి ఆహ్వానాన్ని అందించారు. ఇంకా కొంతమందికి పిలుపులు వెళ్లలేదని వస్తున్న వార్తలపై శుక్రవారం సాయంత్రం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి క్లారిటీ ఇచ్చింది. కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'తెలుగు చిత్రపరిశ్రమలోని అన్ని శాఖలు కలసి ఈ వేడుకల్ని నిర్వహిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల మంత్రులు, కేంద్రమంత్రులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారు. ఇతర భాషల సినీ ప్రముఖులు కూడా వస్తారు. ఫిజికల్‌గా ఎవరికైనా ఇన్విటేషన్ అందకపోయినా ఇదే మా వ్యక్తిగత ఆహ్వానంగా భావించి ప్రతి ఒక్కరూ పాల్గొనాలి' అని కోరారు. ఈ కార్యక్రమంలో చదలవాడ శ్రీనివాసరావు, సి.కల్యాణ్, మాదాల రవి, భరత్‌భూషణ్, ప్రసన్నకుమార్, శివబాలాజీ, పరుచూరి గోపాలకృష్ణ, అశోక్‌కుమార్, మాధవపెద్ది సురేశ్, అనిల్‌కుమార్ వల్లభనేని తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి సినిమాలో నటిస్తున్నా



● చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

మెగాస్టార్ చిరంజీవితో కలసి సినిమాలో నటించే అవకాశం లభించనుందని కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవికి తాను పెద్ద అభిమానినని అన్నారు. ఆయనకు తనపై ప్రేమ ఉందని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు హైదరాబాద్‌లోని ఇంటికి పిలిపించి సన్మానం చేశారని అన్నారు. పవన్ కల్యాణ్ గెలిచినప్పుడు తాను ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపానని అన్నారు. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' సినిమా చేస్తున్నారని, అది ముగిశాక ప్రారంభమయ్యే మరో సినిమాలో తాను నటిస్తానని తెలిపారు. తన పాత్ర ఏమిటనేది భవిష్యత్తులో తెలుస్తుందని అన్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

శ్రీరంగపురంలో కల్యాణం



వనపర్తి జిల్లా శ్రీరంగపురంలోని రంగనాథ స్వామి ఆలయం మా కుటుంబానికి చాలా ప్రత్యేకం. సిద్ధార్థ్‌తో నా నిశ్చితార్థం అక్కడే జరిగింది. త్వరలో మా పెళ్లి కూడా అక్కడే జరుగుతుంది' అని కథానాయిక అదితీ రావ్ హైదరీ చెప్పారు. మార్చిలో వారిద్దరికీ నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. తమ ప్రేమ, పెళ్లి గురించి అదితీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పెళ్లి తేదీని పెద్దలు నిర్ణయిస్తారు, మేం ఇద్దరం కలసి ప్రకటిస్తామని చెప్పారు. 'మహాసముద్రం' సినిమా చిత్రీకరణ సమయంలో సిద్ధార్థ్, అదితీ ప్రేమలో పడ్డారు.

అవసరమైతే కోర్టుకు వెళ్తా



బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదల ముంగిట వివాదాల్లో చిక్కుకుంది. ఈ సినిమాను నిషేధించాలంటూ పలు సిక్కు సంఘాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విధించిన అత్యయిక పరిస్థితి ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రమిది. ఇందిరా గాంధీ పాత్రను పోషించడంతో పాటు కంగనే ఈచిత్రానికి దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 06న 'ఎమర్జెన్సీ'ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు కంగన సన్నాహాలు చేశారు. అయితే ఇప్పుడు ఈ చిత్రం విడుదల సందిగ్ధంలో పడింది. తమ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని కంగన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. సినిమాను విడుదల చేసేందుకు అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని ఆమె చెప్పారు. సినిమాలను విడుదల చేస్తే చంపేస్తామంటూ వస్తున్న బెదిరింపుల గురించి మాట్లాడుతూ 'నన్ను భయపెట్టాలని చూసినంత మాత్రాన చరిత్ర మారిపోదు కదా' అని కంగన అన్నారు. సంజయ్ గాంధీ పాత్ర పోషించిన విశాక్ నాయర్‌కు సైతం బెదిరింపులు వచ్చాయి.



ఇటీవల కర్నాటకలోని కూర్గ్‌లో వివాహం చేసుకుని ఒక్కటైన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్ రిసెప్షన్ శుక్రవారంహైదరాబాద్‌లో జరిగింది. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.



అభిమానుల ప్రేమలో తడిసి ముద్దయ్యారు హాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఏంజెలీనా జోలీ. వెనీస్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ఆమె నటించిన 'మరియ' చిత్రం ప్రత్యేక ప్రదర్శనకు హాజరయ్యారు. షో పూర్తవ్వగానే అందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులతో ఆమె నటనను అభినందించారు. దాదాపు ఎనిమిది నిమిషాల పాటు థియేటర్ అంతా మార్మోగింది. తనపై అభిమానులు చూపుతున్న ప్రేమతో ఉద్వేగానికి లోనైన ఏంజెలీనా కన్నీళ్లను ఆపలేకపోయారు. సహనటుడు ఫెయర్స్ ఫావినో ఆమెను సముదాయించారు. అభిమానులకు ఏంజెలీనా ధన్యవాదాలు తెలిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఎన్నో కష్టాలు అనుభవించి ఆమె ఈ స్థాయికి చేరుకున్నారు అని అభిమానులు ఏంజెలినాను ప్రశంసిస్తున్నారు.

అభిమానుల ప్రేమకు ఆనంద భాష్పాలు

మంచి బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నా



తెలుగు సినిమాల్లో తండ్రి పాత్రలు దాదాపు ఒకేలా ఉంటున్నాయి. అయినా తనకు ఇచ్చిన పాత్రల్లో వైవిధ్యం చూపించడానికి కృషి చేస్తున్నారు నటుడు ఆనంద చక్రపాణి. 'దాసి' చిత్రంతో తొలిసారిగా తెరపై కనిపించి లాంగ్ గ్యాప్ తర్వాత మళ్లీ 'మల్లేశం' సినిమాలో తండ్రి పాత్రతో ఎంట్రీ ఇచ్చారు. ఒకే ఒక్క ఛాన్స్ జీవితాన్ని మలుపు తిప్పుతుందని చాలా సందర్భాల్లో నిజమైన విషయం. అలాగే 'మల్లేశం' చిత్రం ఆనంద చక్రపాణి కెరీర్‌ని మలుపు తిప్పింది. ఇప్పటికి 45పైగా చిత్రాల్లో నటించేలా చేసింది.. అవన్నీ విభిన్న పాత్రలు కావడం తన అదృష్టం అంటూ ఆనంద చక్రపాణి చెప్పిన విశేషాలు ఇవి.

- చిన్నప్పటి నుంచి నాకు నటన అంటే ఇష్టం. మంచి నటుడిగా పేరు తెచ్చుకోవాలనే కోరిక ఉండేది. మంచి బ్రేక్ కోసం ఎదురు చూశాను. అది 'మల్లేశం' రూపంలో వచ్చింది. ఇప్పటివరకూ చాలా సినిమాలు చేశాను. ఒక పెద్ద హిట్ పడితే అందరి దృష్టిలో పడతాను. 'రాజు యాదవ్' చిత్రంలో నా పాత్రకు మంచి పేరు వచ్చింది. సినిమా తేడాగా ఉండడంతో ఆడలేదు. ఒక్కోసారి మనం ఎంత బాగా చేసినా సినిమా ఆడకపోతే ప్రయోజనం ఉండదు కదా 'మల్లేశం' స్థాయి పాత్ర నాకు మళ్లీ 'అనగనగా ఒక అతిథి' సిరీస్‌లో వచ్చింది. అందులో నాలుగే నాలుగు పాత్రలు. అందులో తండ్రి పాత్ర కూడా నాకు మంచి పేరు తెచ్చింది.
- ఇంతకుముందు అడ్వర్‌టైజ్‌మెంట్ రంగంలో ఉన్నాను. యాడ్ ఫిల్మ్స్ డైరెక్ట్ చేశాను. ఇప్పుడు మాత్రం నటన మీదే దృష్టి పెట్టాను. నాకు ఇచ్చిన పాత్రకు పూర్తి న్యాయం చేకూర్చడానికి చాలా హోమ్ వర్క్ చేస్తుంటాను. ఆ పాత్రలో ప్రవేశించడానికి మానసికంగా స్ట్రగుల్ అవుతాను. అందరూ అలాగే చేస్తుంటారు కానీ నాకు కూడా ఆ గుణం ఉంది. అందుకేనేమో ఎమోషనల్ ఫాదర్ వేషం అంటే నాకే పిలుపు వస్తుంది.
- పాత రోజుల్లో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్మించిన చిత్రాలన్నీ వదిలిపెట్టకుండా చూసేవాణ్ణి. ఆర్ట్ ఫిల్మ్స్‌తోనే నా నడక మొదలైంది కనుక ఆ తరహా చిత్రాలంటే చాలా ఇష్టం. ఆ రోజుల్లో షబానా అజ్మీ, నజీరుద్దీన్ షా, ఓంపురి, స్మితాపాటిల్ నటించిన సినిమాలు ఎక్కువగా వచ్చేవి. ఆ చిత్రాల ప్రభావం నా మీద బాగా ఉండేది. ఈమధ్య కాలంలో నవాజుద్దీన్, ఇర్ఫాన్ ఖాన్ వంటి నాచురల్ ఆర్టిస్టులు ఎంతో అద్భుతంగా నటిస్తున్నారు. పాత్రలో రాణించడానికి చాలా హోమ్ వర్క్ చేస్తారు. అవన్నీ చూసి ప్రేరణ పొంది, నాచురల్‌గా నటించడానికి కృషి చేస్తున్నాను. మెలో డ్రామా నాకు నచ్చదు.
- ప్రస్తుతం నాలుగు చిత్రాలు షూటింగ్ దశలో, మరో రెండు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. నిఖిల్ నటిస్తున్న 'స్వయంభూ'లో మంచి పాత్ర చేస్తున్నాను. అలాగే పర్యావరణం మీద చేస్తున్న 'గాంధీతాత జట్టు' కూడా నాకు మంచి పేరు తెస్తుందనే ఆశతో ఉన్నా.

టీవీ రంగంలోనూ లైంగిక వేధింపులు

● సీనియర్ నటి కుట్టిపద్మిని



తమిళ చిత్రసీమతోపాటు టీవీ రంగంలోనూ మహిళలపై లైంగిక వేధింపులకు కొదువలేదని సీనియర్ నటి కుట్టిపద్మిని ఆరోపించారు. ఓ తమిళ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. సినిమాల్లోనే కాదు టీవీ సీరియల్స్‌లో నటించే యువతులు కూడా లైంగిక వేధింపులకు గురవడం సహజంగా మారిపోయింది. అలా వేధింపులకు గురయ్యేవారు సమాజానికి భయపడి ఎవరికీ ఫిర్యాదు చేయడం లేదు. పారితోషికాలు పెద్ద మొత్తంలో లభిస్తుండటంతో కొంతమంది ఈ లైంగిక వేధింపులను భరిస్తున్నారు. ఫిర్యాదు చేసేవారికి మళ్ళీ సినిమాల్లో నటించే అవకాశాలు లభించడం లేదు. నటుడు సురేశ్ గోపీపై వస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఎక్కడున్నాయంటూ కొంతమంది అడుగుతున్నారు, ఆధారాలు ఎవరిస్తారు?' అని ఆమె ప్రశ్నించారు. దీనికి సీబీఐ విచారణ లాగా లై డిటెక్టర్లతో పరీక్షల చేయడం మినహా మరో మార్గం లేదన్నారు. దర్శకులు, సాంకేతిక నిపుణుల నుండి మహిళలు లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారని, అవి భరించలేక ఎంతోమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని కుట్టి పద్మిని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

డబుల్ ఫన్..థ్రిల్



విజయం సాధించిన 'మత్తు వదలరా' చిత్రానికి సీక్వెల్‌గా 'మత్తు వదలరా 2' వస్తోంది. శ్రీసింహా కోడూరి లీడ్ రోల్‌లో, సత్య సైడ్ కిక్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి రితేశ్ రానా దర్శకుడు. మైత్రీ మూవీస్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా, సునీల్, అజయ్, రోహిణి ఇతర ముఖ్య పాత్రధారులు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన అనంతరం హీరో శ్రీసింహా మాట్లాడుతూ 'డబుల్ ఫన్, థ్రిల్ ఉండేలా సెకండ్ పార్ట్ చేశాం. సెప్టెంబర్ 13న విడుదలవుతుంది' అని చెప్పారు. ఫస్ట్ పార్ట్‌లోనే ఒక ఐడియాను ప్లాంట్ చేసి దాని నుంచి డైరెక్ట్‌గా సీక్వెల్ చేశామని దర్శకుడు చెప్పారు.

ఇన్ ప్రోగ్రెస్

కోర్టు రూమ్ డ్రామా



త్రిగుణ్ ప్రధాన పాత్ర పోషించిన 'ఉద్వేగం' చిత్రం టీజర్‌ను రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. మహిపాల్ రెడ్డి దర్శకత్వంలో లుకలపు మధు నిర్మించారు. 'కోర్టు రూమ్ డ్రామాతో తెలుగులో చాలా తక్కువ చిత్రాలు వచ్చాయి. ఈ సినిమా టీజర్ చూసిన తర్వాత సిన్సియర్ ఎఫర్ట్ అనీ, అందరూ సహజంగా నటించారనీ అర్థమవుతోంది' అన్నారు రామ్‌గోపాల్ వర్మ. నటుడు ఆదిత్యకు, త్రిగుణ్‌కు ఇది 25వ చిత్రమనీ, చట్టాన్ని బేస్ చేసుకుని రూపొందించిన ఈ సినిమా విడుదల తేదిని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు.

పెళ్లి విందులు.. చిందులు



పెళ్లిలో జరిగే విందులు, చిందుల్ని కన్నుల విందుగా చూపిస్తున్న చిత్రం 'లగ్గం'. సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించిన ఈ చిత్రాన్ని వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. రమేశ్ చెప్పాల దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన హీరో ఆది సాయికుమార్ యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'కథ, కథనం ఈ సినిమాకు బలం. ఫ్యామిలీ మెంబర్స్ అంతా కలసి చూసేలా సినిమా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు. కథ నచ్చి ఈ సినిమా నిర్మించినట్లు నిర్మాత తెలిపారు. 'లగ్గం' సినిమా చేయడం తన అదృష్టం అని సాయిరోనక్ చెప్పారు.

డిసెంబర్‌లో విడుదల



వెట్రిమారన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, సూరి ప్రధాన పాత్రలు పోషించిన 'విడుదల 2' చిత్రం రిలీజ్ డేట్ ఖరారైంది. డిసెంబర్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. గతంలో వచ్చిన 'విడుదల' చిత్రానికి ఇది కొనసాగింపు. గౌతమ్ వాసుదేవ్ మీనన్, అనురాగ్ కశ్యప్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషించారు. ఎల్రెడ్ కుమార్ నిర్మాత. సంగీతం: ఇళయరాజా, సినిమాటోగ్రఫీ: ఆర్ వేల్‌రాజ్.

బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి'



ప్రతిష్ఠాత్మక బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి' వెబ్‌సిరీస్ నామినేట్ అయింది. ఉత్తమ ఓటీటీ ఒరిజినల్, ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగాల్లో ఇది నామినేట్ అయింది. బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు తన సిరీస్ నామినేట్ అవ్వడం పట్ల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఆనందం వ్యక్తం చేశారు. 'ఈ చిత్రోత్సవాలకు రెండు విభాగాల్లో నామినేట్ అవ్వడం మా టీమ్‌కు గర్వకారణం' అని ఆయన సోషల్ మీడియాలో తెలిపారు. ఈ సారి ఇండియా నుంచి బూసాన్ చలన చిత్రోత్సవాలకు ఎంపికైన ఏకైక ప్రాజెక్ట్ గా 'హీరామండి' నిలిచింది. మనీషా కొయిరాలా, అదితీరావ్ హైదరీ, సోనాక్షి సిన్హా తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన ఈ వెబ్‌సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై ప్రేక్షకాదరణ పొందింది.

చంద్రబాబు.. పవన్ పర్యటన రద్దు



జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు

నరసరావుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలించకపోవడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవణ్ కళ్యాణ్ నరసరావుపేటలో శుక్రవారం పర్యటన రద్దు అయింది. తెల్లవారుజాము నుంచి వర్షం కురవడంతో కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో వనమహోత్సవం నిర్వహణకు ఆటంకం ఏర్పడింది. దీంతో వారి పర్యటన రద్దయింది. సభా ప్రాంగణంలో నీరు నిలిచిపోయింది. ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది.

అప్పు డబ్బు కోసం మౌన పోరాటం

చిలకలూరిపేట, ఆగస్టు 30: కష్టపడి సంపాదించుకున్న డబ్బు చిలకలూరిపేటలోని ఓ సెంటర్ భాగస్తులకు అప్పుగా ఇచ్చాం, ఆ అప్పును తిరిగి తీర్చమంటే వారు తమపైనే ఎదురుదాడి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల తరపున పెద్దమనిషిగా వ్యవహరించిన పట్టణ ప్రముఖులు తేలప్రోలు వీరయ్య శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈ సెంటర్ ప్రధాన భాగస్తుడు అమెరికాలో స్థిరపడి తమను వేధిస్తున్నారని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. మొత్తం 15 మంది అప్పు ఇచ్చామని, అది ఇప్పుడు రూ. 8.5 కోట్లకు చేరుకున్నదని వివరించారు. ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వమంటే ఎన్ఆర్ఐలను వేధిస్తున్నారంటూ ఎదురు దాడి చేస్తున్నారని వాపోయారు. వారి ఆస్తులు కబ్జా చేస్తున్నామని సోషల్ మీడియాలో విస్తృతంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా తెలుగుదేశం పార్టీకి చెందిన వారిమి కావడంతో ఈ విషయాన్ని పార్టీ దృష్టి కూడా తీసుకెళ్లామని చెప్పారు. వాస్తవాలు ప్రజలకు తెలియజేసేందుకు సెంటర్ వెలుపల తాము మౌన పోరాటం చేస్తున్నామని చెప్పారు. టీడీపీకి చెందిన వారికి అన్యాయం జరుగుతున్నందున ప్రజాప్రతినిధులు న్యాయం చేయాలని విన్నవించారు.

విద్యుదుత్పత్తి నిలిపివేత..

రెంటచింతల, ఆగస్టు 30: నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 14 గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 2,85,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 2,93,000 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపివేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.19 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.2020 టీఎంసీలకు సమానమన్నారు.

రైల్ ఓవర్ రైల్‌కు గ్రీన్ సిగ్నల్

- బొమ్మైపల్లి - బీబీనగర్ స్టేషన్లను కలుపుతూ 8.54 కి.మీ నిర్మాణం
- రూ.281 కోట్ల నిధులు అవసరమౌతాయని అంచనా
- బడ్జెట్‌లో రూ.20 కోట్ల కేటాయింపు

గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఒక రైల్ ఓవర్ రైల్(ఆర్‌వోఆర్) రానున్నది. నడికుడి మార్గంలో సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్లు, అటు నుంచి ఇటుగా వచ్చే రైళ్లకు పగిడిపల్లిలో సిగ్నల్ క్లియరెన్స్ సమస్యలు తలెత్తుతోన్నాయి. ఇక్కడే రైళ్ల హ్యాండింగ్ వోవర్ జరుగుతుంది. మెయిన్ లైన్‌లో ఏదైనా రైలు వస్తుందంటే దానికి ప్రిసిడెన్స్ ఇచ్చి ఈ మార్గంలో రైలుని నిలిపేస్తున్నారు. దీని వలన కొంత సమయపాలన దెబ్బతింటుంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రైల్వే శాఖ ఆర్‌వోఆర్‌ని మంజూరు చేసింది. కేంద్ర బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించిన దరిమిలా ఈ ఆర్థిక సంవత్సరంలోనే టెండర్ల ప్రక్రియ పూర్తియి పనులు ప్రారంభమౌతాయని రైల్వేవర్గాలు తెలిపాయి.

రైళ్లను నిలుపుదల చేయాల్సిన అవసరం ఉండదు

బీబీనగర్ - గుంటూరు రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు పనులు కూడా త్వరలో ప్రారంభం కాబోతోన్నాయి. ఈ నేపథ్యంలో కీలకమైన బీబీనగర్ - బొమ్మైపల్లి రైల్ ఓవర్ రైల్(ఆర్‌వోఆర్)ని త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే శాఖ భావిస్తుంది. మొత్తం 8.54 కిలోమీటర్ల పొడవునా ఈ ఆర్‌వోఆర్‌ని నిర్మించాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.281 కోట్ల నిధులు ఖర్చు అవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ బడ్జెట్‌లోనే రూ.20 కోట్లను కేంద్ర రైల్వే శాఖ కేటాయించింది. ఈ ఆర్‌వోఆర్ నిర్మాణం జరిగితే పగిడిపల్లి వద్ద క్లియరెన్స్ కోసం రైళ్లను నిలుపుదల చేయాల్సిన అవసరం ఉండదు. నేరుగా కాజీపేట - సికింద్రాబాద్ మార్గంలోకి ప్రవేశించి అక్కడి నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లిపోవచ్చు. ప్రస్తుతం పగిడిపల్లి వద్ద కొన్ని సందర్భాల్లో 10 నిమిషాల నుంచి అరగంట పాటు కూడా నడికుడి నుంచి వెళ్లిన రైళ్లు నిలిచిపోతున్నాయి. దీంతో నిర్ణీత సమయానికి రైళ్లు సికింద్రాబాద్ చేరుకోలేకపోతున్నాయి.



రైల్ వోవర్ రైలు నమూనా

సమయం ఆదా..

గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ పూర్తి చేసినా ఈ ఆర్‌వోఆర్ నిర్మించకపోతే పెద్దగా ఉపయోగం ఉండదు. దీనిని పరిగణనలోకి తీసుకొనే రైల్వే శాఖ ఆర్‌వోఆర్‌ని రైల్వే బోర్డుకు ప్రతిపాదించి మంజూరు చేయించింది. ఆర్‌వోఆర్ వలన కింద ఒక రైలు మార్గం, పైన ఒక రైలు మార్గం ఉంటుంది. దాంతో ఎలాంటి అడ్డంకులు లేకుండా పగిడిపల్లి జంక్షన్‌లో అటు కాజీపేట నుంచి వచ్చే రైళ్లు, ఇటు నడికుడి మార్గం నుంచి వచ్చే రైళ్లు ప్రయాణించగలవు. తద్వారా సమయం ఆదా అవుతుంది.

అనంత భావజాలికుడు చంద్రబాబు

- విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ
- ఘనంగా చంద్రబాబు ఎక్స్‌వో పుస్తకావిష్కరణ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 30: పారిశ్రామిక, క్షీర, హరిత విప్లవం అంటూ నిత్యం ఆలోచించి వాటిని ఆచరణలో పెట్టిన అనంత భావజాలికుడు చంద్రబాబు అని విశ్రాంత ఐఏ ఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ అన్నారు. 'చంద్రబాబు ఎక్స్‌వో ది ఫౌంటైన్ ఆఫ్ క్రియేటివిటీ" ఆంగ్ల పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని గుంటూరు కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో శుక్రవారం నిర్వహించారు. సభకు కమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. ప్రతి వ్యక్తి కుటుంబానికి సమయం ఇవ్వాలనే చంద్రబాబు ఆలోచనను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. విద్యార్థులు పత్రిక, పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. మరో విశిష్ట అతిథి, పుస్తక ఆంగ్ల అనువాద రచయిత డాక్టర్ కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగాల కోసం వెంపర్లాడే స్థితి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి తెలుగుజాతి ఎదగడం చంద్రబాబు దార్శనికత ఫలితమేనని తెలిపారు. 30 నుంచి 300 వరకు ఇంజినీరింగ్ కళాశాలను పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రెరా మాజీ చైర్మన్ డాక్టర్ వెలమాటి రామనాథ్ మాట్లాడుతూ విజన్- 47 ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేసిన నిత్య కృషీ వలుడు చంద్రబాబు అని కొనియాడారు. ఈ పుస్తకాన్ని రాజకీయ కోణంలో కాకుండా ఒక గొప్ప భవిష్యత్తు దార్శనికుని జీవనయానంలోని ప్రస్తుత సమాజానికి, మానవాళికి ఉపయుక్తమైన సంఘటనల సమాహారంగా పరిగణించాలని కోరారు. వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రస్తుత తరంలో ఆలోచించే రాజకీయ నాయకుడు చంద్రబాబు ఒక్కరేనని కొనియాడారు. సభలో పుస్తక రచయిత శాఖమూరు శ్రీనివాస ప్రసాదు, కేజేఎస్ ఎస్ కార్యదర్శి చుక్కపల్లి రమేష్ ప్రసంగించారు. కార్యక్రమంలో కేజేఎస్ఎస్ పాలక వర్గ సభ్యులు, టీడీపీ నాయకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, డాక్టర్ కేవీ సత్యనారాయణ

ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు

గుంటూరు, తాడేపల్లి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఎగువ భాగంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజీకి భారీగా వరదనీరు వచ్చి చేరుతున్నది. శుక్రవారం రాత్రికి ఏ క్షణంలో నైనా 3,35,000 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉందని కృష్ణానది సంరక్షక విభాగం నుంచి జిల్లా యంత్రాంగానికి సమాచారం అందింది. దీని దృష్ట్యా బ్యారేజి ఎగువ, దిగువన నదీపరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వరద ప్రవాహం వద్దకు వెళ్ల రాదని విజ్ఞప్తి చేశారు. పశువులను కూడా నది వద్దకు తీసుకెళ్లొదన్నారు. ఎలాంటి సమస్య తలెత్తినా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నంబరు. 08632234014ని సంప్రదించాలని సూచించారు. తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తుండాలన్నారు. నదిలో వరదనీరు ఉధృతి కారణంగా లోలెవల్ చప్టాల వద్ద ప్రమాదకరంగా నీరు ప్రవహించే అవకాశం ఉన్నందున వాటి వద్ద పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

డెల్టా కాలువలకు 13,563 క్యూసెక్కులు నీరు

పులిచింతల ప్రాజెక్టు నుంచి 3,36,169 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం (రాత్రి వరకు) ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 67 గేట్లను 8 అడుగులు, 3 గేట్లను పూర్తిగా ఎత్తి దిగువకు 3,22,606 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 13,563 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు. కాగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత క్రమేపీ వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని జేఈ తెలిపారు.



విద్యుత్ వెలుగుల్లో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి

రైతుల ఆదాయ వనరులు పెంచండి

- నకిలీ విత్తనాల చలామణిని అరికట్టండి
- వ్యవసాయ శాఖ సమీక్షలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'రైతులకు ఆదాయ వనరులు పెంచే విధంగా వారిని చైతన్యవంతం చేయండి. వాణిజ్య పంటలపై అవగాహన పెంచి రైతులను ప్రోత్సహించండి.' అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గుంటూరులోని ఎంపీ కార్యాలయంలో శనివారం వ్యవసాయ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వపరంగా అందే సేవల్లో ఎలాంటి లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. రైతులకు పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, వారి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. పంటలకు సాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, చీడపీడలపై రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎరువుల కొరత సమస్యను అధికారులు పెమ్మసాని దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విజయకీలాద్రిపై వైభవంగా శ్రావణ శుక్రవారం

తాడేపల్లి టౌన్, ఆగస్టు 30: వేద విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు శ్రీత్రిదండి చినజీయర్ స్వామి మంగళశాసనములతో సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై 4వ శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. తొలుత చిన్నజీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అష్టలక్ష్మి అమ్మవారికి తిరువంజనసేవ, అలంకరణ, అష్టోత్తర శతనామార్చన, శ్రీసూక్త హవనం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర బిల్వార్చన, కదంబ పుష్పాలంకరణ, నివేదన నక్షత్ర హారతి సేవ, మంగళశాసనములతో చివరి శ్రావణ శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు అనంత స్వామి, వేద విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న వెంకటాచార్యులు దంపతులు

26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 30: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా శుక్రవారం అధికారులు నీటిని విడుదల చేశారు. 8 గేట్లను 10 అడుగులు, 18 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,62,430 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం 589.00 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,633 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,354 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,61,430, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 3,12,097 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,12,097 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

కారు, స్కూటర్ ఢీ : ఉపాధ్యాయిని మృతి



డీవీ రత్నకుమారి

ఫిరంగిపురం, ఆగస్టు 30: కారు, స్కూటర్‌ను ఢీకొనగా ఉపాధ్యాయిని మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం మండలంలోని గుంటూరు - నరసరావుపేట రహదారి పై నుదురుపాడు వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం నాదెండ్ల మండలం తూబాడు హైస్కూల్‌లో ఇంగ్లిషు ఉపాధ్యాయునిగా పని చేస్తున్న దంటు వెంకట రత్న కుమారి(45) సాయంత్రం 5 గంటలకు స్కూటీపై ఫిరంగిపురం వస్తుండగా నరసరావుపేట వైపు నుంచి గుంటూరు వెళ్తున్న కారు అతి వేగంగా నడపటం వలన ఉపాధ్యాయిని వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి ఢీకొంది. ఉపాధ్యాయిని రత్నకుమారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలు ఫిరంగిపురంలో నివాసం ఉంటున్నారు. మృతురాలి భర్త అంకిరెడ్డి నరసరావుపేటలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులుగా పని చేస్తున్నారు. వీరికి ఒక కుమార్తె. సంఘటనా స్థలాన్ని సీఐ డి.రవీంద్రబాబు, ఎస్ఐ సదాశివరావు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

నకిలీ కరెన్సీ కేసులో జైలు శిక్ష

ఈపూరు, ఆగస్టు 30: నకిలీ కరెన్సీ నోట్లు కేసులో ముద్దాయికి 3 ఏళ్ల 6 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పినట్లు ఈపూరు ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. 2019 ఆగస్టు 24న ఈపూరు మండలం వనికుంట గ్రామంలో కూల్‌డ్రింక్ షాపులో ముగ్గురు యువకులు కూల్‌డ్రింక్ తీసుకొని రూ.500 నోటు ఇచ్చారు. షాపు యజమాని కాశీమల్ల నాగ రాజు ఆనోటును పరిశీలించి నకిలీదిగా గుర్తించి ఆ యువకులను ప్రశ్నించాడు. దీంతో వారు ఏమి మాట్లాడకుండా అక్కడ నుంచి పారిపోయారు. వెంటనే సదరు షాపు యజమాని నాగరాజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ జి.గిరిబాబు కేసు నమోదు చేశారు. అప్పటి వినుకొండ సీఐ ఎంవీ సుబ్బారావు కేసును దర్యాప్తు చేసి రొంపిచర్ల మండలం సంతగుడిపాడుకు చెందిన వర్ల చిరంజీవిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నర్సరావుపేట ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి ఎ.పూర్ణిమ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వర్ణలత భాను వాదనలు వినిపించారు.

పులిచింతల ప్రాజెక్టులో 42.16 టీఎంసీల నీరు

అచ్చంపేట, ఆగస్టు 30: పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,71,624 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 13 గేట్ల ద్వారా 3,11,345 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువకు విడుదల అవుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	196.00
చికెన్ స్కిన్ లెస్	206.00

51,315 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 44,587 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 51,315 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 15,619 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	17500	334	8500	14500
నెంబరు. 5	9000	12500	నెంబరు. 5	12000	12000
273	10500	14500	273	10500	13500
341	9000	16500	341	8000	15000
4884	11400	11400	4884	10000	13500
సూపర్ 10	8500	9000	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18500	తేజ	8000	18700
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	8500	13000	దేవనూరు డీలక్స్	9500	14000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	10500

ఒక్క రోజు ముందుగానే పింఛన్ల పంపిణీ

● 2,31,200 మందికి రూ.96.25 కోట్లు విడుదల

బాపట్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఈసారి పింఛన్ల పండుగ ఒక్కరోజు ముందే మొదలుకానుంది. సెప్టెంబరు ఒకటి ఆదివారం రావడంతో వృద్ధులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పింఛన్లను ఈనెల 31నే ఇంటింటికీ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను జిల్లాలో 2,31,200 మందికి పింఛన్ల పంపిణీకి అవసరమైన రూ.96.25కోట్లను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. పింఛన్ల పంపిణీని శనివారం ఒక్కరోజులోనే పూర్తి చేయడానికి యంత్రాంగం సిద్ధమైంది. దీనిలో భాగంగా 4,314 మంది సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నారు.

పెన్షన్ల పంపిణీలో భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, ఆగస్టు 30 : నియోజకవర్గంలో శనివారం ఉదయం నుంచి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఉదయం 9 గంటలకు రెండో వార్డు రామకృష్ణాపురంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

● జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ

బాపట్ల, ఆగస్టు 30 : రైతులకు మెరుగైన సలహాలు, సేవలు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ తెలిపారు. బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం చీరాల సబ్‌డివిజన్, బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు, వ్యవసాయాధికారులకు పంట జీవన వ్యవస్థ, చీడ, పీడల తెగుళ్ళ ఉధృతి ఉనికి లేదా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి అధ్యక్షత వహించి మాట్లాడుతూ పంట దశలో తెగుళ్ళ, వ్యాధుల గుర్తింపు, పోషకాహార లోపాలతో కూడిన ప్రాథమిక వ్యవసాయ, ఉద్యాన పంటల సమగ్ర ఫొటోల రిపాజిటర్ అభివృద్ధి చేయటం, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, మిషన్ లెర్నింగ్ టెక్నాలజీ ద్వారా లక్ష్యాన్ని సాధించటానికి క్రాప్‌లైఫ్ సిస్టమ్ అప్లికేషన్ అభివృద్ధి చేయబడిందన్నారు. కార్యక్రమంలో జిల్లా రీసోర్స్‌పర్సన్, డిప్యూటీ డైరెక్టర్ జి.నిర్మల, డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఉషా, ఉద్యానవనశాఖాధికారి జెన్నెమ్మ పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పీ

బాపట్ల, ఆగస్టు 30 : పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగ విరమణ చేసిన పోలీసు ఉద్యోగులతో, సర్వీస్‌లో ఉంటూ మృతి చెందిన పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులతో సమావేశమైన ఎస్పీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన భద్రత, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐసీ, చేయూత, ఇండోఫండ్, కార్పస్‌ఫండ్, అడిషనల్ కార్పస్‌ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ నగదు వంటి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇతర రాయితీలు అందినది లేనిది అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగ విరమణ చేసిన పోలీసు ఉద్యోగులకు, సర్వీస్‌లో ఉంటూ మృతి చెందిన పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు శాఖ ఎల్లవేళల అండగా ఉంటుందని తెలిపారు. ఏమైన సమస్యలు ఎదురైతే స్వయంగా తమకు తెలియజేయవచ్చు అన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, ఏవో బి.శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, సెక్షన్ సూపరింటెండెంట్ బి.రాధ, షేక్ కరీముల్లాషా వలి తదితరులు పాల్గొన్నారు.


పోలీసు అధికారులతో ఎస్పీ తుషార్ డూడి

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

బాపట్ల, ఆగస్టు 30 : నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు బాపట్ల ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగులు, నాయకులు నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఉద్యోగులందరికి డ్యూటీతో కూడిన అలవెన్స్‌లు జీతంతోపాటు కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కండక్టర్లు, డ్రైవర్లకు నైట్ అవుట్ అలవెన్స్‌లు పునరుద్ధరించాలన్నారు. జీవోనెంబరు 114లోని అలవెన్స్‌లను అమలు చేయాలన్నారు. సర్వీస్‌లో చనిపోయిన ఉద్యోగుల అంత్యక్రియలకు రూ.25 వేలు ట్రెజరీ ద్వారా ఇప్పించాలన్నారు. మెడికల్ రీఎంబర్స్‌మెంట్, పెండింగ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు ఖాతాలో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అన్నం రామ్మోహనరావు, డిపో కార్యదర్శి వై.శ్రీనివాసరావు, శివారెడ్డి, మాధవరాజు, ఆషాబాబు, గాంధీ, చిట్టిబాబు, రత్నంపాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలి

● జాతీయ బీసీ సంఘు జాయింట్ సెక్రటరి కె.క్రాంతికుమార్

బాపట్లరూరల్, ఆగస్టు 30 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలోరాణించాలని జాతీయ బీసీ సంఘ జాయింట్ సెక్రటరి కె.క్రాంతికుమార్ అన్నారు. బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జాతీయ క్రీడాదినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల ద్వారా మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉంటారని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బోయన వెంకటేశ్వరమ్మ, ఎస్ఎంసీ ఛైర్మన్ నాగరాజు, వంకాయలపాటి హరిబాబు, మురళీ కృష్ణ, బసంత్‌కుమార్, ఉపాధ్యాయులు వీరచంద్ర పాల్గొన్నారు.

జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

బాపట్ల, ఆగస్టు 30 : మోడల్ కేరీర్ సెంటర్ జిల్లా ఉపాధి కార్యాలయం, గిరిజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బాపట్లలో జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు ఎస్‌కె సేఫ్టీ విన్నింగ్ లిమిటెడ్, కేఎల్ గ్రూప్స్ కంపెనీవారు పాల్గొన్నారు. 36 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. జిల్లా ఉపాధి అధికారి కె.రఘు, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి ఎం.ఫణిదూర్జటి మాట్లాడుతూ గిరిజన యువతకు ఉపాధి కల్పన, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలుకార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. అందులో భాగంగా జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషన్ హరిక సౌగంధి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ రామాంజనేయులకు చీరాల అభినందనలు


డీఎస్పీ రామాంజనేయులను పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న చీరాల గోవర్ధనరెడ్డి

కర్లపాలెం, ఆగస్టు 30 : బాపట్ల నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రామాంజనేయులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బాపట్ల మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి శుక్రవారం కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. వీరి వెంట గోవర్ధనరెడ్డి తనయులు చీరాల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దాల ముసలయ్య తదితరులు ఉన్నారు.

నటి జత్వాని కేసులో అక్రమార్కులకు శిక్షపడాలి

బాపట్ల, ఆగస్టు 30 : వైసీపీ పాలనలో అవినీతి ఆరాచకాలతోపాటు పారిశ్రామిక దిగ్గజం సజ్జన్ జిందాల్‌పై ముంబాయి సినీనటి కాదంబరి జత్వాని పెట్టిన రేప్ కేసు సెటిల్‌మెంట్‌ను అధికారులకు అప్పజెప్పి ఆమెను, తల్లిదండ్రులను నిర్బంధించి భయభ్రాంతులకు గురిచేయటం దారుణమని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి పేర్కొన్నారు. ఈ విషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ నటి జత్వానికి న్యాయం జరిగి అక్రమార్కులకు శిక్షపడాలన్నారు. ఈ కుట్రలో దాగి ఉన్న గుట్టు బహిర్గతం చేయాలన్నారు. తప్పుడు ఫిర్యాదులు అడ్డుపెట్టుకొని జిందాల్‌కు ప్రభుత్వాలు, పోలీసులు సహకరించటం ప్రజాస్వామ్యానికే పెను ముప్పు అన్నారు. దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొల్లా కోరారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

● డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి


మొక్కలు నాటుతున్న డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి

బాపట్ల, ఆగస్టు 30 : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి కోరారు. మండల సమైక్య కార్యాలయంలో శుక్రవారం వికసిత్ భారత లక్ష్యాలను, రానున్న 100 రోజుల యాక్షన్‌ప్లాన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మహిళా సాధికారిత సాధించాలని ఏపీఎంలకు దిశ, నిర్దేశం చేశారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ, ముద్ర లోన్‌లపై సంఘ సభ్యులకు అవగాహన కల్పించి అర్హులైన లబ్ధిదారులకు వారు చేస్తున్న జీవోపాదులకు ప్రోత్సహకాలు అందించాలని తెలిపారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్‌డీపీఎం సుబ్బారావు, ఫైనాన్స్ డీపీఎం రవికుమార్, బ్యాంక్ లింకేజి డీపీఎం లక్ష్మణాచారి, స్త్రీనిధి ఏజీఎం నాగబాబు, జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి తమ్మాజి, ఏపీఎంలు రామకృష్ణ, ఫణిబాబు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి తదితరులు

● పిట్టలవానిపాలెం, ఆగస్టు 30 : కృత్రిమ ఆక్సిజన్ కన్న మొక్కల పెంపకం ద్వారా వచ్చే ఆక్సిజన్ ఎంతో అవసరం అని పిట్టలవానిపాలెం మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్‌సోపాటి అన్నారు. మండలంలోని సంగుపాలెం గ్రామంలో శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు విధిగా ఒక మొక్క అయినా నాటి సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బర్మా బుల్లియ్య, చెరుకూరి యాదయ్య, తోడేటి కిషోర్, బర్మా జాన్‌బాబు, చందోలు రవి, జాన్ సైమన్, మట్లపూడి ప్రసన్న, చెరుకూరి సంపత్, బర్మా ఝాన్సీ, కె.చరణ్, పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.


మొక్కలను నాటుతున్న గూడపాటి శ్రీనివాసరావు తదితరులు

● రేపల్లె, ఆగస్టు 30 : కాలుష్యకోరల్లో చిక్కుకున్న రాష్ట్రాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందని, ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 25వవార్డులో శుక్రవారం వనమహోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గృహాల వద్ద మొక్కలను నాటి వదిలేయకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకుని చెట్టు ఎదిగే వరకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శేషాద్రి, ఛైర్‌పర్సన్ కట్టా మంగా, వైస్ ఛైర్మన్ టీకేవీ గుప్తా, మాజీ కౌన్సిలర్ షేక్ జమీర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిరకాల ఫలాలతో అమ్మవారికి అలంకరణ


అన్ని రకాల ఫలాలతో అలంకరించిన శ్రీవాసవిమాత

బాపట్ల, ఆగస్టు 30 : శ్రావణమాసం నాల్గవ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని అన్ని రకాల ఫలాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డాక్టర్ కొత్తమాసు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు.


చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

● రేపల్లె, ఆగస్టు 30 : శ్రావణమాసం చివరిశుక్రవారం సందర్భం గా లక్ష్మీదేవికి భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు. పట్టణంలోని బూరుగులమ్మ దేవాలయంలో, ఇసుకపల్లిలోని భ్రమరాంబ చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారికి ఉదయం కుంకుమ పూజ, లలిత సహస్రనామ పారాయణం, మల్లెపూల పూజ, ఆయా దేవాలయాల అర్చకులు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదానాలను అందజేశారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ రవీంద్ర

కర్లపాలెం, ఆగస్టు 30 : వాహనం నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ పెట్టుకొని తమ ప్రాణాలను కాపాడుకోవాలని కర్లపాలెం ఎస్సై రవీంద్ర వాహనదారులకు పిలుపునిచ్చారు. కర్లపాలెం సెంటర్‌లో పలువాహనాల యజమానులకు శుక్రవారం సాయంత్రం వాహన నియమ, నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగియుండటమేకాకుండా హెల్మెట్ ధరించాలి, కారు నడిపే వారు సీటుబెల్ట్ ధరించాలని ఎస్ఐ రవీంద్ర సూచించారు.

నేడు దోనేపూడిలో ఎమ్మెల్యే ఆనందబాబు పెన్షన్ల పంపిణీ

కొల్లూరు, ఆగస్టు 30 : మండల గ్రామం దోనేపూడిలో శనివారం వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు నక్కా ఆనందబాబు పెన్షన్‌లు పంపిణీ చేయనున్నారు. ఎస్సీ కాలనీలో పేదలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను అందజేయనున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. అనంతరం భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామం ఎస్సీ కాలనీలో కూడా పెన్షన్‌లు అందజేయనున్నారు.

అమ్మవారి దీక్ష చేపట్టిన భక్తులు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 30 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి దీక్ష, పూర్ణాహుతిహోమం, ఇరుముడి సమర్పణ గావించారు. ఈ కార్యక్రమానికి దీక్షను స్వీకరించిన భక్తులు విచ్చేశారు. వక్కలగడ్డ ప్రసాద్ ఆధ్వర్యంలో దీక్షను స్వీకరించిన భక్తులచే దీక్ష స్వీకరణ, ఇరుముడి సమర్పణ, పూర్ణాహుతి హోమ కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కావూరు గ్రామానికి చెందిన చీదెళ్ళ సుబ్బారావు, కర్లపాలేనికి చెందిన మోడి శ్రీనివాసరావు భక్తులకు ప్రసాద పంపిణీకి సహకారం అందించారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

పిట్టలవానిపాలెం, ఆగస్టు 30 : మండలంలోని చందోలు గ్రామపంచాయతీలోని రెడ్లపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి, అలాగే మౌలికసదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎండీఎం నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

పిట్టలవానిపాలెం, ఆగస్టు 30 : మండలంలోని సంగుపాలెం కోడూరు గ్రామపంచాయతీలో బాపట్ల జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రొడక్షన్స్ కౌన్సిల్ సభ్యులు తోడేటి నీలాంబరం ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల నుండే విద్యార్థులు అంకితభావంతో విద్యనభ్యసించాలని అన్నారు.

దగ్ధమైన కారు

కొల్లూరు, ఆగస్టు 30 : వెళుతున్న కారులో నుంచి ఒక్కసారిగా మంటలు ఏర్పడి కారు దగ్ధమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వేమూరుకు చెందిన పాముల అనీల్ వేమూరు నుంచి కొల్లూరు వస్తుండగా రావికంపాడు అడ్డరోడ్డు సమీపంలోకి రాగా కారు ఇంజన్‌లో నుంచి పొగ రావడంతో ఆపి చూసే లోపు ఒక్కసారిగా మంటలు వ్యాపించి కారు దగ్ధమైంది. ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

వాహనం ఢీకొని ఆవుకు గాయాలు

బాపట్ల, ఆగస్టు 30 : పట్టణంలో రోడ్డుపైకి వచ్చిన ఆవును శుక్రవారం ఓ వాహనం ఢీకొట్టింది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయిన ఆవును స్థానికులు రక్షించే ప్రయత్నం చేస్తున్నారు.

కొల్లూరు, అనంతవరం సెక్టార్లలో సమావేశం

కొల్లూరు, ఆగస్టు 30 : కొల్లూరు, అనంతవరం సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. కొల్లూరు సెక్టార్ సమావేశం గౌడపాలెంలోని 5వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి నిర్వహించగా, అనంతవరం సెక్టార్ సమావేశాన్ని సూపర్‌వైజర్ నగరాజకుమారి నిర్వహించారు. ఏసీడీపీవో విజయరాణి ఆయా సమావేశాలకు హాజరై కార్యకర్తలు, కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్దిదారులకు అందజేయడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆవులవారిపాలెంలో సూపర్‌వైజర్ నగరాజకుమారి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పెంపకం అవశ్యకత గురించి వివరించారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభ కవచ, శిఖర ప్రతిష్ఠ

అమృతలూరు, ఆగస్టు 30 : మండల పరిధిలోని తురుమెళ్ళలో శ్రీపర్వతవర్ధనీ సమేత శ్రీ విరూపాక్ష స్వామి దేవస్థానంలో శిఖర ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక, హోమాలు పూజలు జరిపారు. పూజల అనంతరం ధ్వజ శిఖర ప్రతిష్ఠ, కళాన్యాసం, కుంబాభిషేకం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. గ్రామస్తులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాంచారమ్మ తల్లి ఆలయంలో లలితా స్తోత్రం పఠనం

అమృతలూరు, ఆగస్టు 30 : మండల పరిధిలోని మోపర్రు గ్రామ దేవత నాంచారమ్మతల్లి ఆలయంలో లలితా స్తోత్రం పఠనం శుక్రవారం చేశారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతోపాటు, స్థానిక శాసనసభ్యులుగా నక్కా ఆనందబాబు గెలుపొందడంతో గ్రామానికి చెందిన తెలుగు మహిళలు నాలుగు వారాల పాటు లలితా స్తోత్రం పఠనం చేసి మొక్కు చెల్లించుకున్నారు. ఈ శ్రావణమాసం ఆఖరి వారంతో పఠనం కార్యక్రమం ముగిసిందని చెప్పారు.

బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

వేమూరు, ఆగస్టు 30 : భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేమూరు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పార్టీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు మండా జనార్ధన్ కోరారు. శుక్రవారం ఆయన వేమూరులో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వ నమోదు కలిగిన ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అన్నారు. కేంద్రంలో ప్రజా మద్దతు కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఎన్డీఏ ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాలను బిజెపి శ్రేణులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎల్లమాటి దాసు, మండల అధ్యక్షుడు వెలివేల సాంబశివరావు, పెనుముడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధురాలు ఆత్మహత్య

కొల్లూరు, ఆగస్టు 30 : అనారోగ్య కారణాలతో వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కొల్లూరు ఎస్సీ కాలనీకి చెంది చొప్పర కరుణ (73) తన సోదరితో నివాసం ఉంటుంది. ఆమెకు ఇరువురు కుమార్తెలు. ఒకరు దుబాయ్‌లో, ఒకరు హైదరాబాద్‌లో ఉద్యోగ రీత్యా ఉంటున్నారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయింది. శుక్రవారం ఎస్సీ కాలనీ సమీపంలోని పంట కాల్వలో వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సోదరి కూడా చేతికి గాయమై వైద్యశాలలో ఉండటంతో పాటు అనారోగ్య సమస్యలతో వృద్ధురాలు కాల్వలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా చెబుతున్నారు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన బ్రాంచ్ ప్రారంభం

చెరుకుపల్లి, ఆగస్టు 30 : గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా మెరుగైన సేవలను అందించేందుకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభించామని బ్యాంకు డీజీఎం బిజినెస్ హెడ్ ఎంవీఎస్ సుధాకర్ అన్నారు. గుళ్ళపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంకు ఆఫ్ బరోడా బ్రాంచ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు, డ్వాక్రా సభ్యులకు రూ.20 లక్షల వరకు తక్కువ వడ్డీతో రుణాలు అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రీజీఎం ఎస్‌కే కిరణ్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ రీజనల్ మేనేజర్ చంద్రమౌళి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, రేపల్లె నియోజకవర్గ టీడీపీ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి, బ్యాంకు సిబ్బంది, వివిధ గ్రామాల రైతులు, డ్వాక్రా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె, ఆగస్టు 30 : గ్రామాల్లో ఉన్న పేద ప్రజలు ప్రధానమంత్రి సురక్షయోజన, జీవనజ్యోతి బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్ఫ్ సంస్థ టీసీవో నారాయణ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఐటీసీ బంగారు భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సర్ఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య బీమా, ఆర్థిక అక్షరాస్యత అంశాలపై శుక్రవారం మండలస్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.శివపార్వతి, ఈవోపీఆర్డీ మల్లికార్జున్‌రావు, సర్ఫ్ సంస్థ సీవో ఎం.బుజ్జి, అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు

● పంట పొలాలను పూడ్చివేస్తున్న వైనం
● అధికారులు దృష్టిసారించాలంటూ ప్రజల వినతి


నగరం గ్రామంలో మట్టిని సరి చేస్తున్న ఎక్స్‌కవేటర్

రేపల్లె, ఆగస్టు 30 : నియోజకవర్గంలోని చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం పంచాయతీకి సంబంధించిన మూడు చెరువులలో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వుతూ నగరం, చెరుకుపల్లి, చందోలు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారులకు సమీప గ్రామస్థులు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. అనుమతులు లేకుండా చెరువుల్లో అడ్డగోలుగా వందలాది ట్రక్కుల మట్టి తవ్వకాలు జరుపుతూ మండల స్థాయి నాయకులు లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తైన చూసిన దాఖలాలు లేవు. ఎకరం పొలాన్ని పూడ్చటానికి రూ.15 లక్షలు వసూలు చేస్తున్నారు. నగరం శివారులో పంట పొలాలను ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పూడ్చివేస్తున్నారని, దీని కారణంగా చుట్టుప్రక్కల పొలాలు దెబ్బతినే పరిస్థితి ఉందంటూ రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి అక్రమాల మట్టి తవ్వకాలను నిలిపివేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పరిటాల రవీంద్రకు ఘన నివాళి


కేక్‌కట్ చేస్తున్న పరిటాల యువసేన, టీడీపీ నాయకులు

రేపల్లె, ఆగస్టు 30 : రాయలసీమ ప్రజలకు అండగా ఉండి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడు పరిటాల రవీంద్ర అని పరిటాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు దండమూడి ధరణికుమార్ అన్నారు. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 66వ జయంతిని పురస్కరించుకుని మండలంలోని నల్లూరుపాలెం గ్రామంలో ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది పేదలకు అండగా నిలబడి, టీడీపీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారన్నారు. ఆడపడుచులకు అండగా ఉండి వేల మంది ఆడపడుచులకు ఉచితంగా వివాహాలు జరిపించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేజ్‌కుమార్, పాపారావు, రామారావు, అగస్త్య, కల్యాణ్, మురళి, సురేష్, పవన్, సతీష్, నల్లూరుపాలెం టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి


తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందిస్తున్న సీఐటీయూ, యూటీఎఫ్, ఉపాధ్యాయ నాయకులు

రేపల్లె, ఆగస్టు 30 : కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన యూటీఎఫ్ పెన్షన్ స్కీమ్ వ్యతిరేకిస్తూ పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎంవీ సుబ్రహ్మణ్యం అన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) సీఐటీయూ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ పేరుతో గతంలో ఉద్యోగులు దాచుకున్న వాటినే పెన్షన్ ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఉద్యోగులకు ఏదో అదనంగా పెన్షన్ ఇస్తున్నట్లు యూపీఎస్ పేరుతో మోసం చేయటానికి సిద్ధమైందని విమర్శించారు. సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కేంద్రంలో యూపీఎస్ పేరుతో రాష్ట్రాల మీద బలవంతంగా ఉద్యోగులకు నష్టం చేసే పెన్షన్ తీసుకురావటం కుట్రపూరిత నిర్ణయం అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రేపల్లె పాతతాలూకా కమిటీల నాయకులు వి.సుబ్బారావు, రాజభూషణం, జీ.రవీంద్ర, రత్నబాబు, లక్ష్మణుడు, ఏలియా, వంగర శ్రీనివాసరావు, రహేమతుల్లా, సీఐటీయూ నాయకులు కె.లక్ష్మణ్‌రావు, ఎ.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో అసంబద్ధ సర్దుబాటు ప్రక్రియ

● ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌కుమార్

వేమూరు, ఆగస్టు 30 : రాష్ట్ర విద్యాశాఖలో ప్రస్తుతం జరుగుతున్న సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌కుమార్ అన్నారు. ఆయన వేమూరులో శుక్రవారం విలేఖర్లతో మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలన్న ఆలోచనతో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో సర్దుబాటు చేయాలన్న విధానం అనేక సమస్యలకు దారి తీస్తుందన్నారు. 10 సంవత్సరాలుగా ఇంగ్లీషు బోధిస్తున్న ఉపాధ్యాయుడుని సైన్స్ మెథడాలజీ కలిగి ఉన్నదని గుర్తించి బయోలాజికల్ సైన్స్ బోధించమని వేరే పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. అదే విధంగా స్పోజ్ విషయంలో కూడా ఐదారు కిలో మీటర్ల వ్యత్యాసంతోనే డివిజన్లో మారుతున్నాయి. ఈ కారణంగా భార్యభర్తలుగా ఉన్న ఉపాధ్యాయులు ఇబ్బందిపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలి : ఎంపీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలితకుమారి

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 30 : సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ డీవీ లలితకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, మండల గ్రామాల్లోని మురుగు నీటి కాల్వల్లో ఎబేట్ ద్రావణం పిచికారీ చేయడంతో పాటు దోమల నియంత్రణకు అన్ని గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అన్ని గ్రామ పంచాయతీలకు ఫాగింగ్ మిషన్లు సరఫరా చేసినప్పటికీ వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడం, వినియోగానికి పనికి రాకుండా పోవడంతో గ్రామ కార్యదర్శులపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జడ్పీటీసీ ఉదయభాస్కరి, ఎంపీడీవో చంద్రశేఖరరావు, ఈవోపీఆర్‌డీ ఊహారాణి, వైద్యాధికారులు పద్మజ, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా బాలయ్య సినీ స్వర్ణోత్సవాలు


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు మురళీకృష్ణ, మధుసూదన ప్రసాద్

కొల్లూరు, ఆగస్టు 30 : ప్రముఖ సినీ నటులు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవాలను శుక్రవారం స్థానిక ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ మైనేని మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఆయన మాట్లాడుతూ, 1974లో తాతమ్మకల చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన బాలయ్య 50 ఏళ్లు పూర్తి చేసుకున్నారన్నారు. అనంతరం 20 కేజీల స్వర్ణోత్సవ సంబరాల భారీ కేక్‌ను మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుంకర రామమోహనబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు (బుజ్జి), మల్లంపాటి హరిబాబు, సుంకర శ్రీను, శిగిలిశెట్టి రాఘవరావు, కోగంటి శివవెంకటేశ్వరరావు, తుమ్మల బాపయ్య చౌదరి, యడ్ల శ్రీను, మున్నంగి విజయ్, కాసరనేని మోహన్, లంకోతు వెంకటేశ్వరరావు, కుర్రా సత్యనారాయణ, బుర్రి జగన్, కొమ్ము తులామాను, బీజేపీ నాయకులు గుమ్మడి చంద్రం, బాలయ్య అభిమానులు పాల్గొన్నారు.

బదిలీల గడువు సెప్టెంబరు 15 వరకు పొడిగింపు

ఊపిరిపీల్చుకున్న ప్రభుత్వ ఉద్యోగులు



ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 30: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల గడువును సెప్టెంబరు 15వతేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి పీయూష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15 ప్రభుత్వ శాఖల్లో బదిలీలను చేపట్టేందుకు ఈనెల 15న ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తిచేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించింది. ప్రస్తుతం బదిలీల ప్రక్రియపై ఇంకా కసరత్తు చేయాల్సి రావడంతో ప్రభుత్వం 15వతేదీ వరకు గడవును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సెప్టెంబరు 16 నుంచి ఎలాంటి బదిలీలు చేపట్టరాదని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

అంతర్‌జిల్లా బైకు దొంగల అరెస్ట్

28 వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



మాట్లాడుతున్న డీఎస్పీ రామరాజు

కనిగిరి ఆగస్టు 30: బైకు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రామరాజు తెలిపారు. వారినుంచి రూ.18 లక్షల విలువైన 28 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కనిగిరి ప్రాంతంలో పలుచోట్ల బైకులు చోరీకి గురవుతుండటంతో ఎస్‌ఐ త్యాగరాజు నేతృత్వంలో ప్రత్యేకంగా సిబ్బంది నియమించినట్లు చెప్పారు. ఈక్రమంలో గతనెల 15న కనిగిరి మండలం చాకిరాల గ్రామానికి చెందిన మల్లెల కొండారెడ్డి, వినుకొండకు చెందిన పసుపర్తి లక్ష్మీనారాయణ కనిగిరి ప్రభుత్వాసుపత్రి వద్ద రోడ్డు పక్కన ఉన్న బైకును దొంగిలించి మద్దిపాడు మీదుగా వెళ్తున్నారు. అక్కడి పోలీసులు వారినిఆపి బైకు లైసెన్స్, కాగితాలను అడగటంతో తటపటాయించారు. వారికి అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా బైకు కనిగిరి ప్రాంతానికి చెందినదిగా గుర్తించారు. దీంతో మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్శి జైలుకు తరలించి సమాచారాన్ని కనిగిరి పోలీసులకు ఇచ్చారు. దర్శి సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మల్లెల కొండారెడ్డి, లక్ష్మీనారాయణలను జైలునుంచి పీటీ వారెంట్‌పై కస్టడీలోకి తీసుకుని కనిగిరి పోలీసులు విచారించారు. ఈ విచారణలో గుంటూరు, కృష్ణా, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని పలుచోట్ల బైకు దొంగతనాలకు పాల్పడినట్లు నేరం రుజువైంది. కేసు నమోదు చేసి జైలుకు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ ఖాజావలి, ఎస్‌ఐ త్యాగరాజు పాల్గొన్నారు.

జైలులో స్నేహంతో బైకులు దొంగిలిస్తూ..

కనిగిరి మండలం చాకిరాలకు చెందిన మల్లెల కొండారెడ్డి గుంటూరులో ఉంటూ పలు దొంగతనాలకు పాల్పడ్డాడు. గత ఏడాది హనుమంతునిపాడు మండలంలోని అడ్డరోడ్డు వద్ద ఓ బ్రాందిషాపులో నకిలీ కరెన్సీ నోటు మార్పు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో మల్లెల కొండారెడ్డికి దర్శి సబ్ జైలు రిమాండ్‌కు తరలించారు. అదే జైలులో చిల్లర దొంగతనాల కేసులో జైలులో ఉన్న గుంటూరు జిల్లా వినుకొండ ప్రాంతానికి చెందిన పసుపర్తి లక్ష్మీనారాయణతో పరిచయం ఏర్పడింది. చింతం నాగభూషణం, శ్రీను, చెంచయ్య అని పేర్లు మార్చుకుని లక్ష్మీనారాయణ పలుచోట్ల దొంగతనాలకు పాల్పడుతుండగా పోలీసులు పట్టుకుని దర్శి జైలుకు తరలించారు.

ఒకరిపై 28 కేసులు, మరొకరిపై 7 కేసులు

నకిలీ కరెన్సీ నోటు కేసులో బెయిల్‌పై బయటికి వచ్చిన మల్లెల కొండారెడ్డిలో ఏ మాత్రం పరివర్తన రాకపోగా బైకులు దొంగించటంలో ఆరితేరాడు. గతంలో కూడా ఇతనిపై సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, నరసరావుపేట, వినుకొండ, కావలి, ఒంగోలు ప్రాంతాల్లో బైకులు దొంగిలించేవాడు. ఇతనిపై ఆయా ప్రాంతాల్లో 21 కేసులు నమోదయ్యాయి. లక్ష్మీనారా యణతో కలసి వివిధ ప్రాంతాల్లో జనసంచారం లేకుండా రోడ్ల వెంట ఉన్న బైకులను టార్గెట్ చేసి బైకులను దొంగిలించేవారు. లక్ష్మీనారాయణపై పలుచోట్ల ఏడు కేసులు నమోదయ్యాయి. బైకును దొంగిలించే క్రమంలో ప్రాంతం, సమయాన్ని బట్టి కొండారెడ్డి పథక రచన చేస్తే ఆపథకం ప్రకారం లక్ష్మీనారాయణ వాహనాన్ని తరలించేవాడు. ఎవరైన కనిపెట్టి ఆపితే వెనుకాలే కొండారెడ్డి వచ్చి మందలించినట్లుగా లక్ష్మీనారాయణకు మైండ్‌సరిగా లేదన్నట్లు నటించి పలాయనం చిత్తగించేవారు. ఈక్రమంలో గతనెల 15న కనిగిరిలో బైకు దొంగిలించి మద్దిపాడు వద్ద పోలీసులకు చిక్కారు.

భారీ స్థాయిలో పట్టుబడ్డ బైకులు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైకులను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

ఇటీవల కనిగిరి ప్రాంతంలో బైకులు చోరీకి గురవుతున్నాయి. వీటిపై డీఎస్పీ రామరాజు ప్రత్యేక నిఘా పెట్టారు. ఎస్‌ఐ త్యాగరాజు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శోభన్‌బాబును ప్రత్యేక టీంగా ఏర్పాటుచేశారు. ఈక్రమంలో మద్దిపాడులో అరెస్టయి దర్శి జై లులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మల్లెల కొండారెడ్డి, పసుపర్తి లక్ష్మీనారాయణలపై అనుమానం వచ్చింది.ఉన్నతాధికారుల అనుమతితో వా రిని జైలునుంచి కస్టడీలోకి తీసుకుని కనిగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు.విచారణలో దొంగిలించిన బైకుల వివరాలు వెల్లడించారు. కొన్ని బైకులు చాకిరాల ప్రాంతంలోని టిడ్కో అపార్ట్‌మెంట్ లో ఉన్నట్లు గుర్తించి పరిశీలించగా బయటపడ్డాయి. డీఎస్పీ ఆదేశాలతో సీఐ ఖాజావలి ఆధ్వర్యంలో ఎస్‌ఐ త్యాగరాజు సుమారు రూ.18లక్షలు విలువ గల్గిన 28 మోటర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు డీఎస్పీ రామరాజు తెలిపారు. దొంగల నుంచి వివరాలు రాబట్టి, విచారణలో నేర్పుగా వ్యవహరించిన ఎస్‌ఐ త్యాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శోభన్‌బాబును జిల్లా ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

సంక్రాంతి నుంచి పక్కా గృహాలు మంజూరు

మహిళలకు మంత్రి హామీ

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 30 : సంక్రాంతి నుంచి రాష్ట్రంలో కొత్త పక్కా గృహాలు మంజూరు చేస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఒక్కో గృహానికి రూ.4లక్షలను ప్రభుత్వం ఇస్తుందన్నారు. మండలంలోని పంగులూరువారిపాలెంలో శుక్రవారం నిర్వహించిన వనమహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన కొందరు మహిళలు ఆయన వద్దకు వచ్చి తమకు స్థలాలు ఉన్నాయని, పక్కా గృహాలు మంజూరు చేస్తే కట్టుకుంటామని కోరారు. దీనిపై స్పందించిన ఆయన ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ పక్కా గృహం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామం నుంచి పొలాలకు వెళ్లే కొన్ని రోడ్లకు నిధులు మంజూరు చేసి గ్రావెల్ రోడ్లుగా మార్చాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా పలువురు ఆధార్ అప్డేషన్ సమస్యగా ఉందని, మండలంలో మూడు కేంద్రాలు ఉన్నా పనిచేయడం లేదని స్వామికి వివరించారు. దానిపై ఎంపీడీవో జలజాక్షిని మంత్రి వివరణ కోరగా.. ఆధార్ అప్డేట్ చేసే కంప్యూటర్‌లు, ఇతర పరికరాలు పనిచేయడం లేదని వివరించారు.

రైతుకే పెత్తనం...!

సాగునీటి సంఘాలకు ఎన్నికలు
రాష్ట్ర మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్
టీడీపీ హయాంలో పటిష్టంగా సంఘాలు
నీటి యాజమాన్యం, వనరుల నిర్వహణలో భాగస్వామ్యం
వైసీపీ వచ్చాక నిర్వీర్యం
నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం
కూటమి రాకతో తిరిగి సంఘాలపై దృష్టి
మూడు నెలల్లో ఎన్నికలకు ఆదేశం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే తిరిగి సాగునీటి సంఘాలు తెరపైకి వచ్చాయి. అధికారం చేపట్టిన రెండు నెలలకే వాటికి జవసత్వాలు కల్పించే చర్యలను తాజా సర్కారు చేపట్టింది. ఏకంగా మూడు నెలలలోపు ఎన్నికలు నిర్వహించాలని అధికారులను ఆదేశిస్తూ గత బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం తీర్మానించింది. ఇదిలాఉండగా డబ్ల్యుయూఏలకు డీఈ స్థాయి, డీసీలకు ఈఈ స్థాయి, ప్రాజెక్టు కమిటీకి ఎస్‌ఈ స్థాయి అధికారులు ఎన్నికలు నిర్వహిస్తారు. ఆ సంఘాలకు ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఐదేళ్లు కొనసాగే అవకాశం ఉంది. ఎన్నికల అనంతరం ఎంపికైన కమిటీలను కలెక్టర్ గుర్తించి ప్రకటిస్తారు. తాజాగా ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో తిరిగి రైతుల పర్యవేక్షణ సాగునీటి వనరులపై సాగనుంది.

ఒంగోలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సాగునీటి వినియోగదారుల సంఘాలకు తిరిగి గుర్తింపు లభించనుంది. వాటికి ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించింది. మూడు నెలల్లో వనరుల వారీగా ఉండే సాగునీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యుయూఏ)కు ఎన్నికలు నిర్వహించేలా చర్యలకు బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఆదేశించింది. ఇందుకు సంబంధించి పదిరోజుల క్రితమే జలవనరుల శాఖ అధికారులకు సంకేతాలు ఉండటంతో మేజర్, మీడియం, మైనర్ సాగునీటి వ్యవస్థల వారీగా సంఘాల వివరాలను, వాటి పరిధిలో రైతుల జాబితాలను సిద్ధం చేసే పని చేపట్టారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సాగునీటి సంఘాలకు ప్రత్యేక గుర్తింపు ఉండేది. ఆయకట్టు రైతులతో కూడిన సంఘాలకు ఎన్నికల ద్వారా కమిటీలను ఎంపిక చేసి వాటి పరిధిలో సాగునీటి నియంత్రణ, ఆయా వనరుల అభివృద్ధి, నిర్వహణ చేపట్టారు.

ఇరిగేషన్ ఎస్‌ఈ పరిధిలో..

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఒంగోలు కేంద్రంగా ఉన్న జలవనరుల శాఖ ఎస్‌ఈ పరిధిలో మొత్తం 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 464 సాగునీటి సంఘాలతోపాటు రాళ్లపాడు ప్రాజెక్టు కమిటీ ఉంది. వాటి పరిధిలో సుమారు 5.87లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రధాన సాగునీటి వనరైన ఎన్ఎస్‌పీ పరిధిలో ఉమ్మడి జిల్లాలో దాదాపు 4.42లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా 145 సాగునీటి సంఘాలు, 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ)లు ఉన్నాయి. అలాగే రాళ్లపాడు, మోపాడు రిజర్వాయర్లు, వీబీ ఆనకట్ట, వీఆర్‌కోట ఆనకట్ట, కంభం చెరువు వంటి మధ్యతరహా వనరుల పరిధిలో 47,640 ఎకరాల ఆయకట్టు ఉండగా 27 డబ్ల్యుయూఏలు ఉన్నాయి. ఇక మైనర్ ఇరిగేషన్ పరిధిలోని 952 చెరువుల పరిధిలో 1,35,000 ఎకరాల ఆయకట్టు ఉండగా 40 హెక్టార్ల విస్తీర్ణం కన్నా ఎక్కువ ఆయకట్టు ఉన్న వాటికి నీటి సంఘాలు ఉంటాయి. ఆ ప్రకారం 292 డబ్ల్యుయూఏలు ఉండగా వాటి పరిధిలో దాదాపు లక్షా 7వేల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. అలాగే రాళ్లపాడు ప్రాజెక్టు కమిటీ కూడా ఉంది.

గత ఐదేళ్లు తీవ్ర నిర్లక్ష్యం

టీడీపీ ప్రభుత్వ కాలంలో దాదాపు రూ.500 కోట్లకు పైగా నీరుచెట్టు పథకం కింద అలాగే ఇతర నిధుల ద్వారా పెద్దఎత్తున ఆయా కమిటీల పరిధిలో నీటి వనరుల అభివృద్ధి పనులు జరిగాయి. అలాగే సాగునీటి నియంత్రణలోను ఇటు అధికారులకు, అటు రైతులకు వారధిగా సంఘాలు పనిచేశాయి. కాగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని నిర్వీర్యం చేసింది. ఐదేళ్లపాటు సాగునీటి సంఘాల కమిటీలకు కాలపరిమితంగా 2020 సెప్టెంబరుకు పూర్తయ్యింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం వాటికి ఎన్నికలు నిర్వహించకుండా ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో ఉంచింది. నిధులు ఇవ్వకుండా నీటి వనరులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. కనీస మరమ్మతులు లేక అనేక వనరులు దెబ్బతినిపోయాయి. .

బాలినేని అక్రమాలను వెలికితీస్తాం

సమగ్ర విచారణకు సీఎం సానుకూలత
అవినీతికి సంబంధించి పలు కీలకపత్రాలు అందజేశా
మాజీమంత్రి కోరిక మేరకే విచారణ
జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ స్పష్టం



మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 30: మాజీ మంత్రి, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అవినీతి, అక్రమాలను వెలికితీసేందుకు సమగ్ర విచారణ చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేసినట్లు జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ తెలిపారు. అందుకు సంబంధించి కొన్ని ఆధారాలను కూడా సీఎంకు అందజేసినట్లు తెలిపారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో బాలినేని కూడా తనపై వచ్చిన ఆరోపణలపై 'మీరు అధికారంలో ఉన్నందున విచారణ చేసుకోవచ్చు' అని చెప్పిన విషయాన్ని రియాజ్ గుర్తుచేశారు. యరజర్ల వద్ద పేదలకు పట్టాలు ఇస్తామని చెప్పి రూ.40కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. 18 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని ఆయన వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి విల్లాల ప్రాజెక్టుకు తరలించారని ఆరోపించారు. ఆ స్థలాన్ని మైన్స్‌కు కేటాయించారన్న విషయం తెలిసి కూడా ఇటువంటి దారుణానికి ఒడిగట్టడం దుర్మార్గంగా ఉందన్నారు. ఎన్నికల ముందు 25వేల మందికి పట్టాలు ఇస్తామని చెప్పి కొందరికే ఇచ్చారన్నారు. ఒంగోలులో భూకుంభకోణాల విషయంలో సిట్ వేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మంగమూరు రోడ్డులోని బ్రాహ్మణుల చెందిన స్థలాన్ని ఆక్రమించుకున్న విషయం బాలినేనికి తెలియకుండా ఉందా? అని ప్రశ్నించారు.

మీ పేర్లు రావడంతోనే సిట్ పక్కదారి

భూకుంభకోణం కోసం వేసిన సిట్‌లో బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి పేర్లు బయటకు రావడంతో అప్పటి సీఎం జగన్‌ని బతిమిలాడుకొని విచారణను తప్పుదారి పట్టించింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. నగరపాలక సంస్థలో శానిటరీ విభాగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పోస్టులు ఇవ్వాల్సి ఉండగా అందుకు భిన్నంగా వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు ఇచ్చారని ఆరోపించారు. అటువంటి వారికి నగర పాలక సంస్థ నుంచి నెలకు రూ.25 లక్షల మేర జీతాలు చెల్లిస్తున్నారన్నారు. పారిశుధ్య విభాగంలో ఎవరు పని చేస్తున్నారో విచారణ చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. వీటన్నింటిపై విచారణ చేస్తానని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని తెలిపారు.

మీ కోరికను త్వరలో నెరవేరుస్తాం

బాలినేని శ్రీనివాసరెడ్డి కోరికను త్వరలోనే నేరవేరుస్తామన్నారు. ఐదుసార్లు ఒంగోలు శాసనసభ్యుడుగా పనిచేసిన బాలినేని కోరిన మేరకే ఈ విచారణ జరుగుతుందన్నారు. ఆయన జనసేన పార్టీలో చేరుతున్నట్లు ఇంతవరకు ఎలాంటి సమాచారం లేదన్నారు. ఆయన ప్రజాధనం దుర్వినియోగం చేసినందున ప్రజాపక్షాన ఉండి పోరాడతామని రియాజ్ స్పష్టం చేశారు. వచ్చేనెల 2న జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా 1న మెడికల్ క్యాంపు, చెట్లు నాటడం తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు. 2న రక్తదాన శిబిరాలతోపాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రియాజ్ తెలిపారు.

జిల్లాపై అల్పపీడన ప్రభావం

పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం.. చల్లబడిన వాతావరణం
పైర్లకు జీవం, మరికొంత కురిస్తే సాగుకు ఉపయోగం



ఒంగోలులో కురుస్తున్న వర్షం

ఒంగోలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాపై అల్పపీడన ప్రభావం కనిపించింది. పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. అంతేకాక శుక్రవారం పగటిపూట అంతా చిరుజల్లులు అత్యధిక ప్రాంతాల్లో పడుతూనే ఉన్నాయి. దీంతో ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడటంతో ప్రజానీకం సేదతీరారు. అదేసమయంలో నెలరోజులకుపైగా సరైన వర్షం లేక వాడుముఖం పట్టిన పైర్లకు తాజా జల్లులు కాస్తంత జీవం పోశాయి. ఈ ఏడాది వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో వర్షాలు సరిపడా లేకపోవడమేకాక ఎండల తీవ్రత కూడా పెరిగింది. గతానికి భిన్నంగా ఆగస్టు రెండవ పక్షంలో కూడా వేసవిని తలపించే రీతిలో ఎండలు మండిపోయాయి. సాధారణం కన్నా ఐదారు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగి గరిష్టం 38 డిగ్రీల మేర అధిక ప్రాంతాల్లో నమోదయ్యాయి. అంతేకాక తీవ్ర ఉక్కపోత వాతావరణంతో ప్రజానీకం ఉక్కిరిబిక్కిరయ్యారు. మరోవైపు వర్షాలు సరిలేక సాగు ముందుకు సాగలేదు. వేసిన పైర్లు సైతం వాడుముఖం పట్టాయి.

ముసురు మాదిరిగా జల్లులు

ఈ పరిస్థితుల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లాపై చూపింది. గురువారం రాత్రి నుంచి పలు ప్రాంతాల్లో జల్లులు ప్రారంభమై శుక్రవారం సాయంత్రం వరకు ముసురుగా కొనసాగాయి. జిల్లాలో శుక్రవారం ఉదయానికి సగటున 6.4మి.మీ వర్షపాతం నమోదైంది. హనుమంతునిపాడులో గరిష్ఠంగా 26.4 మి.మీ నమోదు కాగా పొన్నలూరులో 20.2, ఒంగోలులో 18.4, పుల్లలచెరువులో 14.0, కేకేమిట్లలో 11.2, టంగుటూరులో 10.2 మి.మీ నమోదు కాగా ఇతర పలు మండలాల్లో కూడా జల్లులు పడ్డాయి. అలాగే శుక్రవారం పగటిపూట కూడా జిల్లా అంతటా వాతావరణం చల్లబడటంతోపాటు ముసురుగా జల్లులు పడుతూనే ఉన్నాయి. తాజా వానలతో పొలంలో వాడుముఖం పట్టిన పైర్లు జీవం పోసుకున్నాయి. అయితే మరో రెండు, మూడు రోజులు మంచి వర్షాలు కురిస్తే తదుపరి సాగుకు ఉపయుక్తంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పొగాకు ఉత్పత్తులపై పన్నులు నియంత్రించాలి

ప్రభుత్వాన్ని కోరిన రైతు ప్రతినిధులు
కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని వినతి



ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఒంగోలు,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని ఉత్పత్తులపైనా జీఎస్టీ పేరుతో ఒకే పన్ను విధానం ఉండగా పొగాకు ఉత్పత్తులపై మాత్రం మూడు రకాల పన్నులు వసూలు చేస్తున్నారని రైతు ప్రతినిధులు అవేదన వ్యక్తం చేశారు. ఈ పన్నుల కారణంగా విదేశాల నుంచి స్మగ్లింగ్ సిగరేట్లు పెరిగి ఆ మేర సాగుదారులకు నష్టం వాటిల్లుతుందని, ఇతర ఉత్పత్తుల తరహాలో పొగాకుపై కూడా జీఎస్టీ మాత్రమే వసూలు చేయాలని కోరారు. ఆ మేరకు శుక్రవారం సాయంత్రం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్రప్రభుత్వ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీతో పాటు సెంట్రల్ ఎక్సైజ్, ఎన్‌సీసీడీ పన్నులు వసూలు చేస్తున్నారని, దాంతో దేశంలో పొగాకు ఉత్పత్తుల ధరలు భారీగా ఉంటున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. విదేశాల నుంచి భారీగా స్మగ్లింగ్ సిగరెట్లు తెచ్చి తక్కువ ధరకు అమ్మడం వల్ల ఇక్కడ ఉత్పత్తి అయిన వాటికి డిమాండ్ ఉండటం లేదన్నారు. ఆ ప్రభావం పొగాకు కొనుగోళ్లపై పడి రైతులు కూడా నష్టపోతున్నారని ఈ పరిస్థితిని గుర్తించి పొగాకు ఉత్పత్తులపై ఇతర పన్నులు రద్దుచేసి జీఎస్టీ మాత్రమే వసూలు చేయాలన్నారు. ఆ మేరకు ఢిల్లీలో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కేంద్రం దృష్టికి తీసుకెళ్లి సానుకూల పరిష్కారం లభించేలా చేయాలన్నారు. రైతు ప్రతినిధులు పోటు మురళీ, పోతుల నరసింహారావు, వడ్డెళ్ల ప్రసాద్, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, వరహాలుచౌదరి ఉన్నారు.

ఉత్సాహంగా వనమహోత్సవం

పలు ప్రాంతాల్లో మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు
పంగులూరివారిపాలెంలో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి



మొక్కలు నాటుతున్న మంత్రి స్వామి, అధికారులు

ఒంగోలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. 'మొక్కలు నాటదాం-హరితాంధ్ర కోసం అడుగులు వేద్దాం' నినాదంతో ఈసారి రాష్ట్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. అటవీ శాఖ సామాజికవన విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వనమహోత్సవాన్ని నిర్వహించగా జిల్లాలో పెద్దఎత్తున మొక్కలు నాటేలా ఉపాధి పథకం అనుసంధానంతో అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో జిల్లాలోని అన్ని మండ లాలు, పట్టణాలతోపాటు అనేక గ్రామాల్లో మొక్కలు నాటారు. ఆయా ప్రాంతాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. జరుగుమల్లి మండలం పంగులూరివారిపాలెంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ స్వామి వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ మొక్కలు నాటగా, భాగ్యనగర్‌లో విద్యార్థులతో కలిసి నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావులు పాల్గొని మొక్కలు నాటారు. కనిగిరిలో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరులో ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి, దర్శిలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దూపాడులో వైపాలెం టీడీపీ ఇన్‌చార్జీ ఎరిక్షన్‌బాబు పాల్గొని మొక్కలు నాటారు. ఇతర ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు స్థానిక అధికారులు పాల్గొని మొక్కలు నాటారు.

పథకాల సమన్వయ అధికారిగా చంద్రుడు

ఒంగోలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు సమన్వయ అధికారిగా సీనియర్ ఐఏఎస్ గంధం చంద్రుడు నియమితులయ్యారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మరింత వేగవంతంగా ప్రజలకు అందేలా, మెరుగైన ఫలితాలు వచ్చేలా చేసేందుకు అన్ని జిల్లాలకు ప్రభుత్వం ఒక్కొక్క ఐఏఎస్ అధికారిని సమన్వయకర్తగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. అందులో జిల్లాకు ప్రస్తుతం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీగా ఉన్న గంధం చంద్రుడు నియమితులయ్యారు. కర్నూలు జిల్లాకు చెందిన చంద్రుడు 2010 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా, అనంతపురం కలెక్టర్‌గా రాష్ట్రస్థాయిలో వివిధ శాఖల అధిపతిగా పనిచేసిన ఆయనకు ప్రజల అధికారిగా పేరు ఉంది. అనంతపురం కలెక్టర్‌గా మెరుగైన సేవలు అందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌సీ డీడీఏ విజయనిర్మల

పంటల సాగును యాప్‌లో నమోదు చేయాలి

మార్టూరు, ఆగస్టు 30: రైతులు సాగుచేసే పంటల వివరాలను, పంటలకు సోకే తెగుళ్ల తదితరాలను సీఎల్ఎస్ యాప్‌లో నమోదు చేయాలని డీఆర్‌సీ డీడీఏ విజయనిర్మల అన్నారు.శుక్రవారం మార్టూరులోని వెలుగు కార్యాలయంలో మార్టూరు, పర్చూరు, అద్దంకి సబ్‌డివిజన్ పరిధిలోని రైతుసేవా కేంద్రం సిబ్బం దితో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీడీఏ మాట్లాడుతూ గ్రామాలలో రైతుసేవా కేంద్రం సిబ్బంది రోజువారి చేస్తున్న పను లను టూర్ డైరీలో నమోదుచేసుకోవాలన్నారు. ఏడీఏ రత్నకుమారి క్రాప్‌లైఫ్ సిస్టమ్ యాప్ గురించి సిబ్బందికి వివరించారు. అంతేగాకుండా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎంటమాలజీ సైంటిస్టు డాక్టరు ఎన్. కామాక్షి మాట్లాడుతూ వివిధ పంటలలోని పురుగు,తెగుళ్ల గురించి వివరిస్తూ వాటినివారణకు తీసుకోవలసిన చర్యల గురించి తెలియచేశారు. అలాగే సస్యరక్షణ చర్యలను డాక్టరు ఆర్. బాల మురళీధర్ నాయక్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు శ్రీనివాసరావు, మోహనరావు, ధనరాజ్‌లు, మండల వ్యవసాయ అధికారులు ఎస్‌వీపీ కుమారి, డి.సుబ్బారెడ్డి కె.వెంకటకృష్ణ, శ్రీనివాసరావు, సుధీర్, కె. వేణుగోపాలరావు,ఆదినారా యణ రైతుసేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


కొత్తపేట ప్రసాద్‌నగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

డ్రైయిన్ల నిర్మాణం ఎప్పుడో

కొత్తపేట(చీరాల), ఆగస్టు 30 : వేటపాలెం మండలంలోని కొత్తపేట పంచా యతీ పరిధిలో ప్రజలు సరైన డ్రైనేజీ వ్యవస్థలేక ఇబ్బంది పడుతున్నారు. పలు ప్రాంతాల్లో మురుగు రోడ్లపై పారుతోంది. వర్షాల సమయంలో వర్షాలు ఆగినా రోడ్ల మార్జిన్లలో, మధ్యలో పలు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వ ఉంటుంది. ఒక వైపు సీజనల్ వ్యాధుల ప్రబలుతున్నాయి. నిల్వనీరు, మురుగు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో ఎక్కడ వ్యాధుల బారిన పడుతామేమోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. సమస్య పరిష్కారానికి గతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం డీపీఆర్ తయారు చేశారు. అందుకు సంబంధించిన నిధులు మంజూరు కాలేదు. ఈ క్రమంలో పాలకులు, అధికారులు వాస్తవ పరస్థితులను, సమస్య తీవ్ర తను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి, శాశ్వతంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి అక్రమ రవాణాకు పాల్పడేవారిపై కఠిన చర్యలు

● ఎస్పీ తుషార్ డూడీ



మార్టూరుస్టేషన్‌లో సీఐ శేషగిరిరావుతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

మార్టూరు, ఆగస్టు 30: గంజా యి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ తుషార్ డూడీ పోలీసు అధికారు లను ఆదేశించారు.శుక్రవారం మా ర్టూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆక స్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. వాటిలో ఎక్కువగా పెండింగ్ ఉన్న కేసుల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ స్టేషన్ పరి ధిలో ఎక్కువగా జరిగే నేరాలు, వాటి దర్యాప్తు చేసే విధానాన్ని అడిగి తెలుసుకు న్నారు. జాతీయ రహదారి కావడంతో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టిసా రించాలన్నారు. ద్విచక్రవాహనదారులు రోడ్డు ప్రమాదాలు బారినపడినపుడు ప్రాణా పాయానికి గురికాకుండా తప్పనిసరిగా వారు తలకు హెల్మెట్ ధరించేవిధంగా వారికి అవగాహన కలిగించాలన్నారు. రోడ్డు పక్కన దాబాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, బహి రంగప్రదేశాలలో మద్యం సేవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. హైవేపై గంజా యిని అక్రమంగా రవాణాచేసే వాహనాలను పట్టుకోవాలంటే తరచుగా వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు. రాత్రి సమయాలలో గస్తీని పెంచాలని సూచించారు. దొంగ తనాలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు నిర్వహించాలన్నారు. పోలీస్ ప్రతిష్టకు భంగంకలిగించే వారిపై శాఖాపరమైన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సీఐ శేషగిరిరావు, ఏఎస్ఐ సైదా, తదితరులు పాల్గొన్నారు.

చీరాల మున్సిపల్ కార్యాలయం



ప్రజా సమస్యలపై గళం విప్పేనా !

● నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

చీరాల, ఆగస్టు 30 : చీరాల కౌన్సిల్ సమావేశాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి గళం విప్పే వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. మరో పక్క ప్రేక్షక పాత్ర పోషించే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కోఆప్షన్ సభ్యులుగా నియమితులైన వారు ఒకటి అర సందర్భాల్లో తప్పించి తమ సలహాలు, సూచనలు కౌన్సిల్‌కు అందించటంలో చురుగ్గా లేరనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇక అజెం డాలో పొందుపరిచే అంశాలకు సంబంధించి జరిగే చర్చ కూడా నామమాత్రంగానే ఉంటోంది. ఈ నెల 15వ తేదీ స్వాంతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయజెండా ఎగురవేసే విషయంలో తమను కమిషనర్ చక్రవర్తి అవమానపరిచారని చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, మరికొందరు కౌన్సిలర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 11 గంట లకు జరిగే కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఆ విషయానికి ప్రాధాన్యత ఇస్తారా, లేకుంటే ప్రజా ప్రయోజనాలకు, పురప్రజల సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తారో వేచి చూడాల్సిందే.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

ఇంకొల్లు, ఆగస్టు 30 : మండల పరిధిలో వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునేందుకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఇంకొల్లు సీఐ రమణయ్య తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో యాప్‌ను ఆయన ప్రారంభించినట్లు తెలిపారు. మండలపాల నిర్వాహకులు తమ పూర్తి వివరాలను యాప్‌లో పొందుపరచాలని తెలిపారు. అనుమతులు పొందని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో హరేరామనామ సంకీర్తన

స్థానిక రామమందిరంలో 12 గంటల పాటు నిరంతరాయంగా హరేరామ సంకీ ర్తన జరిగింది. రామునికి విశేష పూజలు చేసి సంకీర్తనలు ప్రారంభించారు.ఈ కార్య క్రమంలో మహిళలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం రామమంది రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరి నాట్లకు రైతులు సిద్ధం

సాగర్ నీరు వస్తుందని ముందుగానే నారు పెంపకం


నాట్లు వేసేందుకు వరినారు పీకుతున్న కూలీలు



బల్లికురవ. ఆగస్టు 30 : బోరు బావుల నీటి ఆధారంగా రైతులు వరి నాట్లు పనులు ముమ్మరం చేశారు. ఇరవై రోజుల క్రితం నారు మడుల పెంపకం చేపట్టిన రైతులు వరి సాగు చేసేందుకు వారం రోజుల నుంచి గ్రామాలలో పనులకు శ్రీకారం పలికారు. శుక్రవారం ఉదయం నుంచి గ్రామాలలో వర్షాలు పడుతుం డటంతో బోరు బావుల కింద చేపడుతున్న వరి నాట్లు మరింత ఊపందుకున్నాయి. సాగర్ డ్యాం నుంచి వరి సాగుకు నీరు వస్తుందన్న ధీమాలో రైతులు ముందుగానే గ్రామాలలో పెద్ద ఎత్తున వరి నారుమళ్ల పెంపకం చేపడుతున్నారు.

మండలంలోని అంబడిపూడి, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, కొప్పెరపాడు, కూకట్లపల్లి, గొర్రెపాడు, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ, కొణిదెన, గంగపాలెం, నక్కబొక్కలపాడు, కొత్తూరు. వైదన, కొప్పెరపాలెం గ్రామాలలో బోరు బావులు అధికంగా ఉన్నాయి. బోర్లకు విద్యుత్ సౌకర్యం కూడా ఉండటంతో నీటికి ఎలాంటి ఇబ్బందులు లేవు. దీంతో రైతులు వారం రోజుల నుంచి వరి నాట్ల పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గత ఏడాది కూడా వరి సాగు చేపట్టిన రైతులకు ధాన్యం ధర అశాజనకంగా ఉండటంతో ఎక్కువ మంది మక్కువ చుపుతున్నారు. బల్లికురవ మండ లంలో సుమారుగా వెయ్యి ఎకరాల్లో బోరు బావుల కింద వరి సాగు అయ్యే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. సాగర్ నీరు కూడా వస్తే అయిదు వేల ఎకరాల్లో వరి సాగు చేస్తామని రైతులు తెలిపారు. కొందరు రైతులు వరి సాగు పనులు మెదలు పెట్టటంతో గ్రామా లలో రోజు వారీ కూలీలకు కూలి పనులు దొరుకుతున్నాయి. అన్ని గ్రామాలలో వ్యవసాయ పనులు ముమ్మరం అయితే కూలీలకు డిమాండ్ కూడా వస్తుంది అని పలువురు అంటున్నారు.

వర్షంతో మెట్ట పంటలకు జీవం

బెట్ట వాతావరణంతో విలవిల్లాడుతున్న మెట్ట పంటలకు శుక్రవారం ఉదయం నుంచి పలు దఫాలుగా కురిసిన వర్షం జీవం పోసింది. మండలంలోని పలు గ్రామాలలో రైతులు పత్తి, జూటు, సుబాబుల్, పొగాకు పంటలను సాగు చేశారు. వర్షాలు లేకపోవటంతో ఎండల ప్రభా వంతో పంటలన్నీ బెట్టకు వచ్చి రోజు రోజుకు వడబడి పోతున్నాయి. ఈ పరిస్థితుల్లో వర్షం పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఖరీఫ్ అరకొర..రబీపైనే ఆశలు


పర్చూరులో అరకొరగా సాగుచేసిన పత్తి పైరు

పర్చూరు, అగస్టు 30: ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ పరిస్థితులు రైతులను అయోమ యానికి గురిచేస్తున్నాయి. ఏటికేటికీ సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్ ప్రారంభంలో అరకొరగా పడిన వర్షాలు మినహా తిరిగి వరు ణుడు కరుణించక పోవటంతో సాగుపరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఖరీఫ్ సాగుకోసం రైతులు దుక్కులు దున్నుకొని పొలాలను సిద్ధం చేసుకున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజ న్ పరిధిలోని పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాలకు సంబంధించి ఖరీ ఫ్‌లో 38,641 వేల ఎకరాల్లో పంటలను సాగుచే యాల్సి ఉంది. అందులో 17,539 ఎకరాల్లో వరి, మిగిలిన 20వేల ఎకరాలకు పైగా ఆయా మెట్ట పైర్లను రైతులు సాగుచేయాల్సి ఉండగా కేవలం 3,500 ఎకరాల్లో మాత్రమే రైతు లు పంటలను సాగుచేసుకున్నారు. వరి సాగుకు సంబంధించి రైతులు విత్తనాల వడ్లను సిద్ధం చేసుకుంటు న్నారు. దీనికి తోడు వరి సాగు విషయంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగర్ ఆయక ట్టుకు నీరు విడుదల చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. సాగుకు సిద్ధం అయ్యి నాట్లు వేసుకుంటున్న తరణంలో నీరు విడుదల చేయలేం అంటూ అప్పట్లో వ్యవసా యాధికారులు ఆదేశాలు కూడా జారీచేశారు. అయితే అప్పటికే వరి సాగుచేసుకున్న రైతులు నీరు అందక తీవ్రంగా నష్ట పోవాల్సి వచ్చింది. గత ప్రభుత్వ చర్యల నేప థ్యంలో కొంత ఆందోళనకు గురిఅయిన రైతులు తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, డ్యాంలలో నీరు పుష్కలంగా ఉండటంతో వరిసా గుకు రైతులు సన్నద్ధం అవు తున్నారు.

పెరగనున్న వైట్‌బర్లీ సాగు

వర్షాలు లేక ఖరీఫ్ సాగు నామమాత్రంగా సాగింది. దీంతో రబీ సాగుపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. దీనికి తోడు గత ఏడాది మిర్చి పైరు గణనీయంగా దెబ్బతినటం, పండిన పంటకు సైతం సరైన ధరలేకపోవ టంతో ఈ ఏడాది ఆ పంట సాగుచేయాలంటే రైతులు భయపడుతున్నారు. అయితే గత ఏడాది ఖరీఫ్, రబీలో సాగుచేసుకున్న వైట్ బర్లీకి నాణ్యమైన ధరతోపాటు, దిగుబడులు కూడా ఉండటంతో ఈఏడాది అధిక శాతం రైతులు ఆపంట సాగుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో రబీలో 60వేల ఎకరాలకు పైగా వైట్ బర్లీని సాగుచేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో అందరి రైతుల దృష్టి రబీసాగు వైపే ఉంది.

జీవం పోసిన వర్షం

చీరాల, ఆగస్టు 30 : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు అన్నింటికి ఉపయోగమేనని రైతులు అంటున్నారు. ఇప్పటికే సాగులో ఉన్న మినుము, వేరుశనగ తదితర పైర్లకు ఈ వర్షం జీవం పోసింది. గత కొంత కాలంగా సరైన వర్షాలు లేకపోవటంతో పచ్చిమేత అందుబాటులో లేదు. గత వారంలో కురిసిన చిరుజల్లులతో పచ్చిక బయళ్లు పచ్చబడ్డాయి. ప్రస్తుతం కురు స్తున్న వర్షాలతో జీవాలు, పశువులకు పూర్తిస్థాయిలో పచ్చిగడ్డి అందుబాటులోకి వస్తుందంటున్నారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పుడమి పులకిస్తోం దని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల్లో ఆనందం

ఇంకొల్లు : అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షపు జల్లులు రైతుల్లో ఆనందాన్ని నింపాయి.వేసిన పత్తి, మొక్కజొన్న పంటలు వర్షాభావంతో ఎండు ముఖం పట్టగా ప్రస్తుతం కురిసిన జల్లులతో అవి ఊపిరిపోసుకున్నాయి. మరో వైపు వ్యవసాయపనులు ప్రారంభించుకునేందుకు ఈ వర్షం ఎంతగానో ఉప యోగపడుతుందని రైతులు భావిస్తు న్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


చీరాల నగరవనంలో మొక్కలు నాటుతున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాల, ఆగస్టు 30 : మొక్కలు నాటటం, వాటిని సంరక్షించటం సమాజంలోని అందరి బాధ్యతని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ చక్రవర్తిలు చెప్పారు. మండలంలోని కీర్తివారి పాలెం పరిధిలో ఉన్న నగర వనంలో శుక్ర వారం అటవీశాఖ ఆధ్వ ర్యంలో నిర్వహించిన వన మహోత్సవంలో వారివురు ముఖ్య అతిథు లుగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్ర మంలో వేటపాలెం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వై. జాన్సన్, పుల్లరిపాలెం, మోటుపల్లి, పెర్లవారి పాలెం బీటు ఆఫీసర్లు బి.శిరీష, ఎస్.నాగమణి, కె.రాగమ్మ, వనసంరక్షణ సమితి అధ్యక్షుడు వేణుగోపాల్, చీరాల రేంజ్ ఆఫీస్ సిబ్బంది ఇర్మియా, రమణమ్మ, బాషా, ప్రొటెక్ట్ ఎన్‌జీవో కార్యదర్శి శవనం రామచంద్రారెడ్డి, వాడరేవు జడ్పీ హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి



అద్దంకిలోని దర్శి రోడ్డులో డివైడర్ మధ్యలో మొక్కలు నాటుతున్న కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్‌లు

అద్దంకి : మొక్కల పెంప కాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యత గా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో ఉన్న డివైడర్ మధ్యలో మొక్కలు నాటారు. ముందుగా ర్యాలీ నిర్వ హించారు. కౌన్సిలర్‌లు యేజెండ్ల నాగరాజు, కంపా రజనీ, అత్తులూరి రమేష్, విజయలక్ష్మి, టీడీపీ నేతలు మాగులూరి గోపి, గుంటూరు మాధవరావు, మున్సిపల్ ఏఈ మరియదాసు, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు మన నేస్తాలు


మేదరమెట్ల మండల కార్యాలయంలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, జడ్పీటీసీ వెంకటరమణ

అద్దంకిటౌన్ : మొక్కలు మన నేస్తాలు అని , వాటిని సంరక్షించాల్సిన బాధ్యత పూర్తిగా మనపై ఉందని ఎంపీడీవో దేవసేన కుమారి అన్నారు. శుక్ర వారం మండలంలోని తిమ్మాయ పాలెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన వన మహోత్సవ కార్య క్రమానికి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. ఈ సంద ర్భంగా బాపట్ల జిల్లా అటవీశాఖ బీట్ అధికారి కే. రమేష్ మాట్లాడుతూ వృక్ష సంపద దేశ సంపద అని, ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుంచే మొక్కలపై అభిరుచి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం పి. గంగాధరరావు, పీడీ కె. సుబ్బారావు, గండు వెంకటరావు, ఏ. శ్రీనివాసరావు, పి. పవ న్, రాఘవరావు, శ్రీను, కాశియ్య, హరికృష్ణ, ప్రదీప్, కొండలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటితే ఎన్నో ఉపయోగాలు

మేదరమెట్ల : మొక్కలు నాటడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఎంపీపీ సాధి నేని ప్రసన్నకుమారి అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో వనం - మనం కార్యక్ర మంలో భాగంగా ఎంపీపీ సాదినేని ప్రసన్నకు మారి, జడ్పీటీసీ తుళ్లూరి వెంకటరమణ, ఎంపీ డీవో సురేష్‌బాబు మొక్కలు నాటారు. గ్రామా ల్లోని ఖాళీ ప్రదేశాలలో అందరూ మొక్కలు నాటాలన్నారు.

గురుకుల పాఠశాలలో వనం - మనం

పర్చూరు : మండల పరిధిలోని నాగులపా లెం బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురు కుల బాలికల పాఠశాలలో శుక్రవారం వనం - మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కడియం నుంచి తెప్పించిన వివిధ రకాల మొక్క లను పాఠశాల ప్రాంగణంలో అధికారులు నేతృ త్వంలో నాటారు. జాయింట్ సెక్రటరీ ఆఫ్ రెసి డెన్సీ శివరామ్, ప్రిన్సిపాల్ విశ్వరాణి, ఈవోఆర్డీ రామకృష్ణ, ఏపీవో బుల్లియ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపాలి

చీరాల, అద్దంకి ఆర్టీసీ డిపోల వద్ద కార్మిక సంఘాల నిరసన


అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న ఎన్ఎంయుఏ కార్మికులు

చీరాలటౌన్, ఆగస్టు 30 : కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపాలని, లేకుంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పలువురు ప్రతినిధులు హెచ్చ రించారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో నల్లబ్యాడ్జీలతో గంటపాటు నిరసన చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేషనల్ మజ్దూర్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు మాట్లాడుతూ కండక్టర్‌లకు, డ్రైవర్ లకు అవుట్ అలవెన్స్‌లు పునరుద్ధరించాలన్నారు. జీవో నెంబర్ 114లోని అలవెన్సులు అమలు చేయాలన్నారు. పీటీడీ రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యూటీ, ఆర్జిత సెలవుల బకాయిలు చెల్లించా లన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరా టాలు ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు దయాబాబు, రవి బాబు, శ్రీనివాసరావు, ప్రవీణ్,ఉద్యోగులు పాల్గొ న్నారు.

అద్దంకిలో..

అద్దంకిటౌన్ : ఆర్టీసీ కండక్టర్‌లకు, డ్రైవర్‌లకు నైట్ అవుట్ అలవెన్స్‌లు పునరుద్ధరించాలని ఎన్ ఎంయూఏ నాయకులకు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌టీసీ ఆవరణంలో నిరసన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యో గులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు అ య్యారు. ఎన్ఎంయూఏ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సేవ నినాదాలతో ముందుకు

చీరాల, ఆగస్టు 30 : అభివృద్ధి, సేవ అనే నినాదాలతో ముందుకు సాగుదామని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేం ద్రనాథ్ అన్నారు. మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీపద్మావతి నిర్వహణలోని మహిళా మండలి లోని అనాథ వృద్ధ శరణాలయంలో శుక్రవారం రాత్రి ప్రముఖ సినీహీరో, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ నట ప్రస్థానం 50 ఏళ్లు అయిన సందర్భంగా అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మహేంద్రనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృ ద్ధిలో అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామన్నారు. సేవా కార్యక్రమా లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. అనం తరం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో నందమూరి అభిమానులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేడుకగా శ్రీనివాస కల్యాణం

● అశేషంగా తరలివచ్చిన భక్తులు



కల్యాణ వేడుకలను వీక్షిస్తున్న భక్తులు (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పర్చూరు, అగస్టు 30: పర్చూరులో నూతనంగా నిర్మాణం చేస్తున్న శ్రీ వేంక టేశ్వరస్వామి సమేత అష్ట లక్ష్మీ దేవాలయంలో శ్రీని వాస కల్యాణం శుక్రవారం అత్యంత వేడుకగా నిర్వ హించారు. బ్రహ్మశ్రీ పవన్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వార్ల కల్యాణ మహోత్సవం చేపట్టారు. కల్యాణ వేడుక లను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావటంతో ఆలయ ప్రాంగ ణంలో సందడి వాతావరణం నెలకొంది. గోవిందా ..గోవిందా అంటూ స్వామివా రిని జపిస్తూ కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. పూజాకార్యక్రమాల అనంతరం తిరుమల తిరుపతి నుంచి తెప్పించిన స్వామివార్ల లడ్డూ ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కమిటీ ప్రతిని ధుల నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అంకమ్మతల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో అంకమ్మతల్లి

పంగులూరు, ఆగస్టు 30 : చెన్నుపాటి వారి వంశదేవర అంకమ్మ తల్లి తృతీయ వార్షికో త్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామంలో కొలువుదీరిన అంక మ్మతల్లికి మొక్కులు చెల్లించేం దుకు పలు జిల్లాల నుంచి చెన్నుపాటి వంశస్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అంక మ్మతల్లిని దర్శించుకుని శాస్త్రోక్తంగా అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించి, పొంగలి, చద్ది నైవేద్యంగా సమర్పించారు. విజయవాడ పడమట, ఫోరంకి, వల్లూరివారిపాలెం, గుంటూరు, ఉన్నవ, ఉప్పలపాడు, గార్లపాడు, కొమ్మూరు, పల్లబాడు, వరగాని, నారాకోడూరు, బోడిపాలెం, తెనాలి, అన్నంభొట్లవారిపాలెం, చిలకలూరిపేట, నెల్లూరు, కారంచేడు, చీరాల, దైవాలరావూరు, మట్టిగుంట, తాటి వారిపాలెం, దుద్దుకూరు గ్రామాలకు చెందిన చెన్నుపాటి వంశస్థులు అధికసం ఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాంస్కృతిక కళావేదిక ప్రారంభం


సాంస్కృతిక కళావేదికను ప్రారంభిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 30 : అక్కాయిపాలెం గ్రామపంచాయతీ పరిధి లోని జడ్పీ హైస్కూల్లో పట్ట భద్రుల సంఘం ఆధ్వ ర్యంలో నిర్మించిన సాంస్కృ తిక కళావేదికను శుక్రవారం పురషోత్తం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రసంగిస్తూ విద్యా ర్థులు చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి అభ్యసించాలన్నారు. ముందుగా సరస్వతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు, హెచ్ఎం బద్రిరెడ్డి, సంఘ ప్రధాన కార్యదర్శి సుంకర వెంకటలక్ష్మి, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీతలకు సత్కారం


హెచ్ఎం గిరిజను సత్కరిస్తున్న ఎస్ ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు

పంగులూరు, ఆగస్టు 30 : స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు సాధించి పాఠశాలకు గుర్తింపు తేవడంలో కృషిచేసిన హెచ్ఎం గిరిజ, పీడీ ప్రతిమలను ఎస్ఎంసీ చైర్మన్ గొట్టిపాటి హరికృష్ణ, సభ్యులు, ఘనంగా సత్కరించారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్క రించుకుని ప్రభుత్వం ఎంపిక చేసిన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డు చంద లూరు పాఠశాలకు లభించడంలో వీరిరువురి కృషిని కొనియాడారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

బల్లికురవ. ఆగస్టు 30 : బల్లికురవ మండల కేంద్రంలో జిలేబీ అమ్మకాలు చేస్తున్న లక్ష్మణ్ రాథోడ్ (22) అను యువకుడు ఇనుప బంకు లైట్ ఆన్ చేస్తుం డగా ప్రమాదవ శాత్తు విద్యుత్ షాక్ తగలటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన యువకుడు జస్వంత్ తన తోటి మరి కొందరి యువకులతో కలిసి బల్లికురవ మండల కేంద్రంలో కొంత కాలం నుంచి సమోసాలు, జిలేబీ అమ్మకాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం తాను అమ్మకాలు చేపట్టే ఇనుప బంకుకు లైట్ ఆన్ చేస్తుండగా వర్షం కురవటంతో విద్యుత్ షార్టు సర్క్యూట్ అయ్యి షాక్ తగిలింది. దీంతో ఒ క్కసారిగా నేలపై పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే స్థానికులు 108కి ఫోన్‌చేశారు. వారు వచ్చే లోపే మృతిచెందాడు.

నేడు మున్సిపల్ సమావేశం

అద్దంకి, ఆగస్టు30: అద్దంకి పురపాలక సంఘం సాధారణ సమావేశం శని వారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుం దని కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. సమావేశం అజెండా లోని 11 వ అంశంపై కౌన్సిలర్‌లలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అప్కాస్ నుంచి అద్దంకి మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బంది లో ఏడుగురుకి ప్రత్యేక పోస్టులు కేటాయించాలని అభ్యర్థనలు రావటం, ఇప్పటికే చైర్‌పర్సన్ ముందస్తు ఆమోదం తెలిపి ఉండటం, శనివారం జరిగే సమావేశంలో ర్యాటిఫై కోసం అజెండాలో చేర్చారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకుం టారో అన్న చర్చ సాగుతోంది.

ఒకరోజు ముందే పెన్షన్‌ల పండుగ

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, అగస్టు 30: అవ్వా, తాతలు, వితంతువులు, వికలాంగులకు ఒక రోజు ముందే పెన్షన్‌లను పంపిణీ చేపట్టడం హర్షించతగ్గ విషయమని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో తెలుగు దేశం, జనసేన, బీజేపీ ప్రజా కూటమి నాయకులు, బూత్ కన్వీనర్‌లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పెన్షన్ల పంపిణీలో పాల్గొననున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 30 : నియోజకవర్గంలో శనివారం జరిగే పెన్షన్ల పంపిణీలో భాగంగా వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొంటారు. తరువాత చీరాల పట్టణంలోని జెన్తపాలెం తదితర ప్రాంతాల్లో పెన్షన్లు పంపిణీలో పాల్గొంటారు. అనంతరం కౌన్సిల్ అత్యవసర సమావేశంలో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి రవీంద్ర శుక్రవారం తెలిపారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

ఇంకొల్లు, ఆగస్టు 30 : పంచాయతీ అధికారులు ఆయా గ్రామాలలో పారి శుధ్య పనులపై దృష్టి సారించాలని ఇంకొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి అంజలి కోరారు. వంకాయలపాడులో జరిగిన సంఘటనలు మరెక్కడా జరగకుండా ఆ యా గ్రామ కార్యదర్శులు మురుగుకాల్వల పూడికతీత, బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ చేసి దోమల వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రేపు పర్చూరులో ఉచిత వైద్య శిబిరం

పర్చూరు, అగస్టు 30: జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా స్థానిక ఏఎస్‌వీఎస్ బాలికల పాఠశాలలో జనసేన నియోజకవర్గ నాయకులు మన్నెం శ్రీకాంత్ ఆర్థిక సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.